RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 95 గురువారం 1 మే 2025 పేజీలు : 4

## ఉగ్రవాదులపై స్పైవేర్ వాడితే తప్పేంటి

న్యూఢిల్లీ : పెగాసస్ స్పైవేర్‌ను ఉగ్రవాదులకు వ్యతిరేకంగా వాడితే తప్పేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాగే దేశ భద్రత, సార్వభౌ మత్వానికి సంబంధించిన అంశాలను స్పృశించిన ఏ నివేదికనైనా బహిర్గతం చేయడం కుదరదని తెలిపింది. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలంటూ అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం దేశం స్పైవేర్‌ను కలిగి ఉండడం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే, అది ఎలా? ఎవరిపై ఉపయోగించారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

# మోదీ సర్కార్ సంచలనం




## దేశవ్యాప్తంగా కులగణనకు నిర్ణయం

కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా కులగణన చేసేందుకు అంగీకారం తెలిపింది. జనాభా లెక్కలతోపాటు కులగణన చేర్చాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని విమర్శిస్తూ.. ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేసింది. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లో కులగణన చేయగా.. దేశవ్యాప్తంగా చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతున్న విషయ తెలిసిందే. తాజాగా ఆ విషయంపై కేంద్ర మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ) న్యూఢిల్లీలో బుధవారం సమావేశమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా కులగణనపై కీలక వ్యాఖ్యలు చేశారు. కులగణన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని ప్రకటించారు. ఈ అంశంపై కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కలలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపడతామని అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉండగా కరోనా కారణంగా వాయిదా పడిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ గుర్తుచేశారు. కులగణన కోసం ఎన్నో ఏళ్లుగా బీసీ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరిగిన అన్ని జనాభా గణన కార్యకలాపాల్లో కులం చేర్చలేదని కేంద్ర మంత్రి చెప్పారు. 'కుల గణన అంశాన్ని మంత్రివర్గంలో పరిశీలిస్తామని 2010లో నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ లోక్‌సభకు హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని పరిశీలించేందుకు మంత్రుల బృందాన్ని ఏర్పాటుచేశారు. చాలా రాజకీయ పార్టీలు కులగణను సిఫారసు చేసినా.. కులగణనకు బదులు సర్వే మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వాలు చేశాయి' అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. సామాజిక వ్యవస్థకు భంగం కలగకుండా చూసేందుకు కులగణనను సర్వేలకు బదులు పారదర్శకంగా జనాభా గణనలో చేర్చాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కాగా ఈ సమావేశంలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకార చర్యలపై ఏం చర్చించారని అడగ్గా అలాంటి చర్చ జరగలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.



## కర్రెగుట్టలపై జాతీయ పతాకాన్ని ఎగురవేసిన భద్రతా బలగాలు

చర్ల: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 వేల అడుగుల ఎత్తులోని కర్రెగుట్టల్లో కీలకమైన మావోయిస్టు నేతలను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన భారీ ఆపరేషన్ బుధవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా కర్రెగుట్టలో కొంత భాగాన్ని భద్రతాబలగాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. శిఖరం వరకు చేరుకున్న బలగాలు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ కనిపించాయి. సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా బలగాలు పెద్ద సంఖ్యలో తెలంగాణ సరిహద్దులోని కొత్తపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని పూజారికాంకేరు, నంబి, గల్‌గం, నడిపల్లి ప్రధాన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 24న జరిగిన ఎదురు కాల్పుల్లో పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) మొదటి బెటాలియన్‌కు చెందిన ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు.

కర్రెగుట్ట ఆపరేషన్ జరుగుతున్న క్రమంలోనే శాంతి చర్చలు జరపాలని కోరుతూ మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే కర్రెగుట్టల ప్రాంతాన్ని అష్టదిగ్బంధనం చేసిన బలగాలు ఆ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన 150కు పైగా ఐఈడీలను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు.




న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని భారత్ గుర్తించింది. దీంతో పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకొంది. అందులోభాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. ఇక పాక్ సైతం అదే రీతిలో స్పందించి.. భారత్‌తో గతంలో చేసుకున్న సిమ్లా ఒప్పందాన్ని సైతం రద్దు చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు ఉప్పు నిప్పుగా మారాయి. తప్పు తనదే అయినా.. ఏ మాత్రం భయపడకుండా.. భారత్ యుద్ధానికి సిద్ధమంటూ పాక్ స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇదే అంశంపై తాజాగా పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తౌల్లా తరార్ స్పందించారు. తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ భారత్‌పై మండిపడ్డారు. తమ జోలికి వస్తే అంతు చూస్తామంటూ భారత్‌ను ఆయన హెచ్చరించారు. మరో 24 లేదా 36 గంటల్లో తమపై యుద్ధానికి భారత్ సిద్ధమవుతోందని చెప్పారు. ఇక ఆ దేశ రక్షణ శాఖ మంత్రి అయితే.. ఈ ఉగ్రవాద చర్యలకు బాధ్యులం తామేనన్నారు. అందుకు కారణాన్ని సైతం ఆయన వివరించారు. అలాంటి వేళ ఏ మాత్రం ఆ

## కవ్విస్తున్న పాక్..

దేశం వెనక్కి తగ్గకుండా.. భారత్‌పై కవ్వింపు చర్యలకు దిగుతోంది. తాజాగా మరోసారి సరిహద్దు నియంత్రణ రేఖ వద్ద.. బుధవారం భారత్ భూభాగంగాపైకి మరోసారి కాల్పులు జరుపుతోంది. జమ్మూ కాశ్మీర్‌లోని నౌషారా, సుందర్బనీ, అక్నూర్ సెక్టార్లలో ఈ కాల్పులు జరుపుతోంది. అలాగే రాకెట్ లాంచర్లను ప్రయోగిస్తోంది. ఇక బారాముల్లా, కుప్వారా జిల్లాలో సైతం దాదాపుగా ఇదే పరిస్థితి నెలకుంది. గత అయిదు రోజులుగా పాక్ ఇదే తీరుగా భారత సరిహద్దులపై కాల్పులకు దిగుతోంది. అయితే ఈ కాల్పును ఎప్పటికప్పుడు భారత్ తిప్పికొడుతోన్న సంగతి తెలిసిందే. మరోవైపు భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో పాక్ కవ్వింపు చర్యలకు ఫుల్ స్టాప్ పేట్టేందుకు భారత్ ఒక్క అడుగు ముందుకు వేసినా ఆశ్చర్య పోనక్కర్లేదు. అదీకాక పహల్గాం ఉగ్రదాడి జరిగిన వెంటనే మళ్లీ సర్జికల్ స్ట్రైక్స్ జరిపే అవకాశముందని పాక్ భావించింది. దీంతో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రమూకలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం విధితమే. కానీ పాక్ ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడిన భారత్ మాత్రం.. సంయమనం పాటిస్తూ వస్తోంది. భారత్ సహనాన్ని మరింత రెచ్చగొడితే మాత్రం పాక్‌పై భారత్ యుద్ధభేరి మోగించడం ఖాయమన్నది.. గత చరిత్రను ఒకసారి పరిశీలిస్తే ఎవరికైనా ఇట్టే అర్థమవుతోంది.




# 'నా పేరు తీసుకునే ధైర్యం లేదు'

## కేసీఆర్ సభపై రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపై.. కేసీఆర్ ప్రసంగంపై రేవంత్ రెడ్డి తొలిసారి స్పందించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. 'నా పేరు తీయడానికి ధైర్యం రాలేదు' అని పేర్కొన్నారు. 'కేసీఆర్ మాటల్లో.. కళ్లల్లో విషం కనిపిస్తోంది. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా?' అని ప్రశ్నించారు. పదేళ్లు దోచుకున్న వారికి కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదని స్పష్టం చేశారు. తమ పాలనతో తెలంగాణ ఆగం కాలేదని ప్రకటించారు. కడుపు నిండా విషం పెట్టుకుని విద్వేష పూరితప్రసంగం చేసి ప్రజల్ని రెచ్చగొట్టి ఏం చేయాలనుకుంటున్నారు? అని నిలదీశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన మహాత్మ బసవేశ్వర జయంతోత్సవ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. బసవన్న స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. బసవేశ్వర స్ఫూర్తితోనే పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థను మనం తెచ్చుకున్నామని తెలిపారు. ప్రతీ మనిషి గౌరవంగా బతికేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. 'వరంగల్‌లో సభ పెట్టి కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. వాళ్లు రజతోత్సవాలు, విజయోత్సవాలు ఏర్పాటు చేసుకుంటే ఆర్టీసీ నుంచి బస్సులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించింది' అని రేవంత్ రెడ్డి వివరించారు. 'మేం చేసిన మంచిని అభినందించి ప్రజా సమస్యలను అక్కడ ప్రస్తావించి ఉంటే బాగుండేది. ఇన్నాళ్లుగా ఆయన ఇంట్లో నుంచి కాలు కదపకుండా జీతభత్యాలు తీసుకున్నారు. ఇది ఏ చట్టంలో ఉంది?' అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 'ప్రతిపక్ష నాయకుడిగా రూ.65 లక్షలు, వాహనాలు, పోలీస్ భద్రత తీసుకున్నారు' అని తెలిపారు. 'మరి ఎందుకు ప్రతిపక్ష నాయకుడిగా పని చేయకుండా ఫామ్ హౌస్ లో పడుకున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫామ్ హౌస్‌లో పడుకుని ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నారు?' అని రేవంత్ రెడ్డి నిల దీశారు. 'రైతు బంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వీటిలో ఏది ఆగిపోయింది? మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం.. ఇవేవీ మీకు కనిపించడంలేదా?' అని రేవంత్ రెడ్డి ప్రశ్నలు వేశారు. పదేళ్లు ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తామని ప్రకటించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ చేద్దాం రండి అని సవాల్ చేశారు. 'కాళేశ్వరం, ఉచిత బస్సు, రుణమాఫీ, రైతు బంధు, 60 వేల ఉద్యోగాలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన వీటిలో దేనిపై చర్చ చేద్దాం అని సూచించారు. చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'బసవేశ్వరుడి స్ఫూర్తితో రాష్ట్ర ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే విధానంతో మేం ముందుకు వెళుతున్నాం. ప్రజలకు మేలు చేయడమే మా పని... ప్రచారం చేయాల్సింది మీరే' అని రేవంత్ రెడ్డి తెలిపారు.

**ప్రభుత్వ నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడట్లేదా?...** "బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వెసులు బాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. మా వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ, ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?

**ఇవేవీ కనబడటం లేదా?...** అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్‌లో ఉంటామంటున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. మీరు హయాంలోని పథకాలు ఏం ఆగిపోయాయి? రైతుబంధు ఆగిందా?, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, ఫీజురియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగాయా? రాష్ట్రంలో ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? మేం సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఇళ్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రైవేటులో లక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్‌ను విస్తరించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ మీకు కనడటంలేదా?. కడుపు నిండా విషం నింపుకొని విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం మంచిదికాదు" అన్నారు.

# సంపాదకీయం

## భారత్‌తో యుద్ధమా.. వణికి పోతున్న పాక్ సైనికులు!

భారత్‌ను తక్కువగా అంచనా వేసి.. ఏ సమస్య ఎదురైనా దీటుగా ఎదుర్కొనేందుకు.. తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని ప్రకటించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు కోలుకోలేని విధంగా సొంత సైనికులు షాక్ ఇచ్చారు. భారత్‌తో యుద్ధమా.. మా వల్ల కాదని తేల్చి చెబుతూ.. కేవలం రెండంటే రెండు రోజుల్లోనే 4500 మంది సైనికులు, 200 మందికిపైగా సీనియర్ అధికారులు తమ ఉద్యోగాలకు రాజీనామా సమర్పించి ఇంటికి వెళ్లిపోయారు. కొందరైతే.. ప్రభుత్వం తీసుకునే చర్యలకు భయటపడి పొరుగు దేశాలకు కూడా వెళ్లిపోయారు. ఈ నేప థ్యంలో భారత్‌పై కాలు దువ్వుతామని.. పహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో తమ జోలికి వస్తే.. ఊరుకు నేది లేదని చెప్పిన ప్రధాని షరీఫ్.. ఇప్పుడు బిక్కచచ్చిపోయారు. యుద్ధమే వస్తే.. ఎదుర్కొనేందుకు తమ సైన్యం సిద్ధంగా లేదని తెలుసుకున్నారు. దీంతో అత్యవసర సమావేశలు పెట్టి.. ఏం చేద్దామంటూ.. తల పట్టుకున్నారు. తాజాగా పాకిస్థాన్ సైనికుల అచేతనత్వం.. భారత్ పట్ల ఒణికిపోతున్న తీరు.. పాకిస్థాన్ 11వ దళ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఉమర్ బుఖారీ.. ఆదేశ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు రాసిన లేఖ ద్వారా ప్రపంచానికి తెలిసింది. ఈ లేఖలో ఆయన దాదాపు పాకిస్థాన్ సైనికుల కాళ్లు, గడ్డం పట్టుకుని బతిమాలు కుంటు న్న తీరు కళ్లకు కట్టింది. పాకిస్థాన్ సైనికులు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా.. రాజీనామాలు చేస్తున్నారని.. దీనివల్ల దేశ ఐక్యత పెనంపై నుంచి పొయ్యిలో పడినట్టు అయిందని.. ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైనికులకు ఆయన ప్రతిజ్ఞ, సాహసాలు, దేశ భవితవ్యం వంటివాటిని గుర్తు చేస్తూ.. బాబ్బా బు.. ఈ ఒక్కసారికి.. అని బ్రతిమాలుకున్న పరిస్థితి కనిపించింది. మీ ప్రతిజ్ఞను మీరు గుర్తు చేసుకోండి. దేశం కోసం త్యాగాలకు ఒడిగడతామని ప్రతిన బూనిన మీరు.. ఇప్పుడు ఈ కీలక సమయంలో కాడి పడేస్తా రా? అని కన్నీటి పర్యంతమైన విధానం లేఖలో రాసిన వాక్యాలను బట్టి అర్థమవుతోంది. అంతేకాదు.. భారత్ సైన్యం విజృంభిస్తే.. తాము తట్టుకోలేమన్న భావనతో రిజైన్ చేస్తున్న సైనికులకు ఆయన సూక్తి ముక్తావళి కూడా బోధించారు. మన బలం మీకు తెలియదు. మ నకు చాలా బలగం ఉంది. మీరు తక్కువగా అంచనా వేస్తున్నారు. వచ్చేయండి అని బుఖారీ తన లేఖలో పేర్కొన్నారు. కాగా.. ప్రస్తుతం సరిహద్దుల వెంబడి తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో పాక్ సైన్యం కాడి పడేసి.. పరుగులు పెట్టి తలదాచుకునే ప్రయత్నం చేయడం భారత దేశ సైనిక శక్తిని ప్రపంచానికి చాటుతోందని అంటున్నారు సైనిక నిపుణులు.

## పదో తరగతి ఉత్తీర్ణతలో సత్తా చాటిన బాలికలు

### 1, 2, 3 టాపర్లుగా నిలిచిన బాలికలు




శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి మండలంలో పదవ తరగతి ఉత్తీర్ణతలో బాలికలే టాపర్లుగా నిలిచి వారి సత్తాను చాటారు. బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో 1, 2, 3 స్థానాల్లో బాలికలు అధిక మార్కులు సాధించారు. ఇందులో శామీర్ పేట మండలం పొన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తి 542 మార్పులు సాధించి మండల్ టాపర్ గా నిలిచింది. తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లహరి 536 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. పొన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హారిక 533 మాకులు సాధించి తృతీయ స్థానంలో మండల్ టాపర్లుగా నిలిచినట్లు ఎంఈఓ కమలాకర్ తెలిపారు.

**మూడు చింతలపల్లి మండలంలో....** మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన ప్రియాంక 556 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా, అదే పాఠశాలకు చెందిన అంజలి 507మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, భానుప్రియ 505 మార్కులు సాధించి తృతీయ స్థానంలో టాపర్లుగా నిలిచినట్లు ఎంఈఓ భాగ్యమని చెప్పారు. ఉమ్మడి శామీర్ పేట మండలం లో ఈ ఘనతను సాధించడానికి అహర్నిశలు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులుకి, ఉపాధ్యాయులకు ఉమ్మడి మండల నాయకులు ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా టాపర్స్ తో పాటు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్ష లు తెలియజేశారు. పరీక్షల్లో ఫెయిల్ అయినా విద్యార్థులు బాధపడాల్సిన అవసరము లేదని, జూన్ లో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో కష్టపడి పాస్ కావాలని ఉమ్మడి శామీర్ పేట మండలానికి చెందిన ఎంఈఓ లు తెలిపారు.

## పురపాలికల్లో విలీనం.. ఉపాధికి దూరం!



వికారాబాద్ : జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ పురపాలికల్లో సమీప గ్రామాలను విలీనం చేశారు. ఈ క్రమంలో అక్కడ అమలు చేస్తున్న 'ఉపాధి' పథకాన్ని అమలు చేయడం లేదు. వికారాబాద్ పురపాలికలో కొంపల్లి, గిరిగిట్‌పల్లి, ధన్నారం, మద్గుల్‌చిట్టెంపల్లి, బూర్గుపల్లి, గుడుపల్లి పంచాయతీలతో పాటు జాంబాపూర్ తండా, బూర్గుపల్లితండా, ధన్నారం తండా, మద్గుల్ చిట్టెంపల్లి తండాలను విలీనం చేశారు. పరిగి పురపాలికలో రుకుంపల్లి, నస్కల్, సయ్యద్ మల్కాపూర్, నజీరాబాద్ పంచాయతీలను విలీనం చేశారు. తాండూరు మున్సిపాలిటీలో సుమారుగా 10 గ్రామాలను విలీనం చేశారు. ఆయా గ్రామాల్లో జాబ్ కార్డులున్నవారు పథకానికి దూరమయ్యారు. దీంతో వారంతా ఇతర పనులకు వెళ్తున్నారు.

**ప్రత్యామ్నాయం దిశగా:** విలీనమైన పల్లెల్లో ప్రత్యామ్నాయంగా వేరే పథకం అమలు చేసేందుకు ఆలోచిస్తున్నామని ఇటీవల అసెంబ్లీలో మంత్రి సీతక్క వెల్లడించారు. ఇది మంచి పరిణామమని 2019లో కొత్తగా ఏర్పాటైన పురపాలిక సంఘాలు, వాటిలో విలీనమైన గ్రామాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 588 గ్రామాల్లో ఉపాధి పథకం అమలు చేస్తున్నారు. 1,32,578 జాబ్‌కార్డులు, 2,45,421 మంది కూలీలు నమోదయ్యారు. **20 వేల మంది..** నాలుగు పురపాలికల పరిధిలో విలీనమైన 20 గ్రామాల్లో సుమారుగా 20 వేల మంది కూలీలు పథకానికి దూరమయ్యారు. ప్రతి గ్రామంలో సగటున వెయ్యి మందికి పని లభించేది. కూలీకి రోజుకు రూ.300 చెల్లిస్తున్నారు. 100 రోజుల పని చేస్తే సులువుగా ఒక్క కూలీ రూ.30 వేలు సంపాదించేవారు. అంతే కాకుండా 100 రోజులు పని చేసిన కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ఉన్నతి పథకంలో ఉపకార వేతనాలు అందజేస్తారు.

పథకాన్ని అమలు చేయాలి..– గోపాల్, తాజా మాజీ కౌన్సిలర్

వికారాబాద్ పురపాలికలో విలీనం చేసిన మద్గుల్‌చిట్టెంపల్లిలో ఉపాధి పథకాన్ని అమలు చేయాలి. గ్రామ జనాభా నాలుగు వేల వరకు ఉంది. వీరిలో 2 వేల మంది నిరుపేదలే. గతంలో వీరికి పనులు చేసేందుకు అవకాశం ఇచ్చేవారు. పురపాలికలో విలీనంతో ఈ అవకాశం లేకుండా పోయింది. ఎండా కాలం పనులు లేక ఇబ్బంది పడుతున్నారు.

పట్టణ ప్రాంతాల్లోనూ ప్రారంభించాలి..– మహిపాల్, సీపీఎం కార్యదర్శి

జిల్లా పూర్తిగా గ్రామీణ ప్రాంతం. నిరుపేదలే అధికం. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పట్టణాల్లో పథకాన్ని అమలు చేయాలి. లేదంటే విలీనమైన గ్రామాల వారికి అవకాశం కల్పించాలి. ఈ సమస్యను గతంలో ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చాం.

## అందని ద్రాక్షగానే కార్డియాలజీ సేవలు



గోదావరిఖని : ఖనిలోని ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఫొటోలు దిగుతుండగా కుప్పకూలారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుండెవ్యాధి నిపుణులు లేకపోవడంతో ప్రాథమిక చికిత్స అందిస్తుండగానే కన్నుమూశారు. విఠల్‌నగర్‌కు చెందిన మహిళ ఇంట్లో పనిచేసుకుంటూ కుప్పకూలారు. కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందారు. మరో యువకుడు సైతం స్థానికంగా చికిత్స అందకపోవడంతో కరీంనగర్ తరలిస్తుండగా మృతి చెందారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గుండెపోటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రత్యేక చికిత్సకు కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత పడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ తదితర విభాగాల్లో సేవలు అందుబాటులో లేవు. ఆయా విభాగాల్లో వైద్య కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు మంజూరైనా.. విధుల్లో చేరేందుకు వెనకడుగు వేస్తున్నారు. యూరాలజీలో ఒక్కరే చేరగా వారంలో రెండు రోజులు మాత్రమే సేవలందిస్తున్నారు. క్రిటికల్ కేసులకు కూడా జనరల్ ఫిజిషియన్లు, సర్జన్లు సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్డియాలజీ పరీక్షలు అందుబాటులో లేక గుండెపోటు బాధితులు ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉంది.

**ప్రైవేటు దవాఖానాల్లో కరవే**

వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఖనిలో ప్రభుత్వాస్పత్రిలో క్యాథలాబ్ ఏర్పాటుతోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతూ లేఖలు రాశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కేవలం ఈసీజీ మాత్రమే అందుబాటులో ఉంది. ఇటీవల ఓ ప్రైవేటు రేడియోగ్రాఫర్‌తో నిర్ణీత రుసుంతో 2డీ ఎకో పరీక్షలు చేయిస్తున్నారు. అయితే కార్డియాలజిస్టు లేకపోవడంతో సరైన చికిత్స అందడం లేదు. ప్రైవేటు దవాఖానాల్లోనూ కార్డియాలజీ వైద్యులు లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్తున్నారు.

**క్యాథలాబ్ ఏర్పాటు చేయాలి**

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. ప్రభుత్వ వైద్య కళాశాలతో పీజీ కోర్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. జాతీయ వైద్య కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి చెందితే అనుమతి లభించే అవకాశముంది. క్యాథలాబ్ ఏర్పాటుతో పాటు కార్డియాలజీ వైద్యుల నియామకంపై శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## మణిహారం.. మరింత భారం

హైదరాబాద్: భాగ్యనగరానికి మణిహారమైన బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) మొత్తం 158 కిలోమీటర్లు విస్తరించి ఉంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎనిమిది లైన్లతో ఎక్స్‌ప్రెస్‌వేని నిర్మించారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఓఆర్ఆర్‌ని రూపొందించారు. ఇటీవల దీన్ని గంటకు 120 కిలోమీటర్లకు పెంచారు. మొత్తం 19 ఎగ్జిట్లు/ఇంటర్‌ఛేంజ్‌లు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి అటు విజయవాడకు, ఇటు వరంగల్‌కి సులభతర అనుసంధానంతో నగరవాసులకు ఎంతోగానో సౌలభ్యంగా ఉంటుంది. రోజుకు సుమారు 1.5 లక్షల వాహనాలు ఓఆర్ఆర్‌పై దూసుకెళుంటాయి. హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్



లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహణలోని ఓఆర్ఆర్‌ని 30 ఏళ్ల లీజుకు ఐఆర్‌బీ సంస్థ 2023లో తీసుకుంది.

**ఐదేళ్లలో గణనీయ పెరుగుదల..** ప్రయాణం పరంగా చూసుకుంటే అంతా సౌలభ్యంగానే ఉన్నా.. ఏటా పెరిగే టోల్‌ఛార్జీల వల్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయిదేళ్లలో పరిశీలిస్తే టోల్‌ఛార్జీల మోత గణనీయంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. కారుకి ఐదేళ్లలో కిలోమీటర్‌కి 52 పైసలు పెరిగింది. బస్సుకు కిలోమీటర్‌కి రూపాయి యాభై పైసలు పెరిగింది. కిలోమీటర్ల చొప్పున చూస్తే మామూలుగానే అనిపించినా ఎక్కువ దూరం ప్రయాణించే వారిపై అధిక భారం పడుతుంది.

## కొలువుతో దారి చూపి.. భవితకు బాటలు వేసి

హైదరాబాద్: ఇంజినీరింగ్, ఫార్మా, నిర్మాణ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో జేఎన్‌టీయూ, ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు.. ప్రాంగణ నియామకాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 'ప్రీ-క్యాంపస్ ఇంటర్వ్యూ' పేరిట ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బహుళజాతి సంస్థలు, ఫార్మా కంపెనీలు రెండు విశ్వవిద్యాలయాల్లోని నియామకాల విభాగం అధికారులను సంప్రదిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఉస్మానియాలో హెటిరో ల్యాబ్స్, జేఎన్‌టీయూలో వేదాంత లిమిటెడ్ ప్రాంగణ నియామకాలు చేపట్టాయి. మరో రెండు, మూడు నెలల పాటు నియామకాలు కొనసాగే అవకాశాలున్నాయని ఆయా వర్సిటీ వర్గాలు తెలిపాయి.

**విభాగాల వారీగా ఇలా..**



బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నవారిలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌తో పాటు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల వారున్నారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లో నాలుగో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 70 శాతం మందికి ట్రైనీ ఇంజినీర్లు, ఇంటర్న్‌షిప్‌లు లభించాయి ఎలక్ట్రానిక్స్‌లో 50, సివిల్‌లో 38, మెకానికల్‌లో 32, ఎలక్ట్రికల్‌లో 35 శాతం మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందాయి. జేఎన్‌టీయూలో గతేడాది 562 మంది క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 446 మందికి ఉద్యోగాలు లభించాయి.

**రూ.10-25 లక్షల వార్షిక వేతనాలు**

ఉస్మానియా, జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వార్షిక వేతనాలు లభిస్తున్నాయి. ఈ వేతనాలు విద్యార్థుల ప్రతిభ, బహుళజాతి సంస్థల అవసరాల ఆధారంగా ఉంటున్నాయి. జేఎన్‌టీయూలో ఓ విద్యార్థినికి రూ.52 లక్షల ప్యాకేజీ, ఓయూలో ఇద్దరు విద్యార్థులకు రూ.26 లక్షల వార్షిక వేతనం లభించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మరిన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఏఐ సిటీ ఏర్పాటు అవుతున్నందున భవిష్యత్తులో ఐటీ, నిర్మాణ, ఆటోమొబైల్ సంస్థలు ప్రాంగణ నియామకాలకు ముందుకొస్తాయని ఆయా వర్సిటీల అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మారుతారా.. మార్చమంటారా !

హైదరాబాద్: ప్రముఖుల పర్యటనలు.. ఉన్నతాధికారుల తనిఖీల సమయంలోనే రోడ్లపై దర్శనమిస్తారు. మిగిలిన సమయాల్లో వాహనాలు బారులు తీరినా.. రద్దీ సమస్య తలెత్తినా కొందరు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తిచూడటం లేదు. నగర ట్రాఫిక్ విభాగంలో కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావటంతో దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు. ఈ జాబితాలో నలుగురు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, కొందరు ఎస్సైలు ఉన్నట్టు తెలుస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ పలుమార్లు ఆదేశించారు. పెడచెవిన పెట్టిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు ఛార్జిమెమోలు జారీచేశారు. మధ్యమండలం పరిధిలో ఓ సీఐపై సస్పెన్షన్ వేటు వేశారు. తూర్పు మండలంలో మరో ఇన్‌స్పెక్టర్ ఫుట్‌పాత్‌లపై ఉన్న టిఫిన్ సెంటర్ల నుంచి స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లను ఇంటికి చేరవేసినట్లు సమాచారం. ట్రాఫిక్ ఠాణాకు బహూకరించిన వంటసామగ్రిని సొంత అవసరాలకు వాడుకోవటం సిబ్బందిలో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరమండలంలో ఓ సీఐపై ఆరోపణలున్నాయి. మధ్యమండలంలో ఇన్‌స్పెక్టర్ నెలవారీ వసూళ్లకు ఇద్దరు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసుకున్నారని సమాచారం.

**అలుసు.. నోటి దురుసు** పశ్చిమమండలం పరిధిలో ఇద్దరు ఎస్సైలు వాహనదారులతో తరచూ గొడవ పడుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. నగరంలో ప్రధాన వ్యాపార ప్రాంతం కావటంతో అక్కడ నిలిపిన వాహనదారుల పట్ల ఓ ఎస్సై నోటిదురుసు ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మధ్యమండలం పరిధిలో ఒక ఎస్సై రాత్రిళ్లు వ్యాపారం చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తానంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. మరో ఇన్‌స్పెక్టర్ మహిళా సిబ్బంది పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇబ్బంది పెట్టినట్లు తెలిసింది.

# హరిత లక్ష్యం ఖరారు...

సిరిసిల్ల : పచ్చదనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విరివిగా మొక్కలు పెంపకానికి శ్రీకారం చుట్టింది. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో ప్రతి గ్రామానికి నర్సరీని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో బహుళ ప్రయోజనాలు ఉండేలా వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. వనమహోత్సవానికి ఈ సంవత్సరం లక్ష్యాన్ని ఖరారు చేసి చలువ పందిళ్ల నీడన మొక్కలను సంరక్షిస్తున్నారు.

జిల్లాలో పన్నెండు మండలాల పరిధిలో 260 గ్రామపంచాయతీలు ఉండగా ఉపాధిహామీ ద్వారా 255 నర్సరీలు ఏర్పాటు చేశారు. గతేడాది 6,06,384 మొక్కలు నాటడం లక్ష్యంగా ఏర్పాటు చేసుకొని 84 శాతం నాటారు. ఈ ఏడాది సైతం 6,77,000 మొక్కలను నాటాలని అధికారులు లక్ష్యంగా ఏర్పాటు చేశారు. నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటినప్పటి నుంచి సంరక్షణ బాధ్యతను ఉపాధిహామీ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. సుమారు 35 రకాల మొక్కలను నర్సరీల్లో పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. వేసవి నేపథ్యంలో అన్ని నర్సరీలపై పర్యవేక్షణ పెంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**పంచాయతీలపై భారం..**

అసలే అరకొర నిధులతో నెట్టుకొస్తున్న పంచాయతీలకు మొక్కల సంరక్షణ కోసం నీడ ఏర్పాటు చేయడం అదనపు భారంగా మారింది. ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో నీడ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మెజారిటీ గ్రామాల్లో షేడ్‌నెట్లను ఏర్పాటు చేశారు. ఇటీవల ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల షేడ్‌నెట్లు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల పాత తెరలతోనే సరిపెట్టగా, మరికొన్ని చోట్ల అరకొర నీడ ఏర్పాటు చేసి చేశారు. విత్తనాలు చాలావరకు మొలకెత్తకపోవడంతో చాలాచోట్ల సంచుల్లో



అసలైన మొక్కలు కాకుండా ఇతర మొక్కలు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల వేసవి తీవ్రత కారణంగా భూగర్భజలాలు అడుగంటడంతో నర్సరీల్లో మొక్కలకు నీటిని సమకూర్చడం గ్రామ పంచాయతీలకు ఇబ్బందిగా పరిణమించింది.

**గత పొరపాట్లకు తావు లేకుండా...**

మొక్కల పెంపకంలో ప్రతిసారి సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారి వెంబడి మొక్కల పెంపకాన్ని చేపడుతుండగా సెస్ సిబ్బంది విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని తొలగించడం పరిపాటిగా మారింది. అడవుల్లో కాలానుగుణంగా ఫలసాయాన్ని అందించే మొక్కలు తక్కువగా ఉన్నాయి. అడవుల్లో ఫల సాయాన్ని అందించే మొక్కలు నాటితే వానరాలు గ్రామాల్లోకి రాకుండా కొంతమేరకు అరికట్టవచ్చు. ఔషధ గుణాలున్న మొక్కలకు ప్రాధాన్యం కల్పించాలి. గ్రామాల్లో ఇంటి ఆవరణలో పెంచుకునేందుకు నిమ్మ, దానిమ్మ, జామ, మునగ, మామిడి, పూల మొక్కలను అందిస్తే స్థానికులు ఆసక్తిగా తీసుకునే అవకాశం ఉంది. గ్రామాల్లోని అంతర్గత రహదారుల వెంబడి నీడ కర్పించే పల్లెల్లోని అంతర్గత రహదారుల వెంబడి మొక్కల పెంపకానికి ప్రాధాన్యం కల్పిస్తే వీధుల్లో పచ్చదనం సంతరించుకునే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో అనువైన స్థలాలు ఎంపిక చేసే విషయమై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# మురుగు మళ్లింపునకు అడ్డంకులెన్నో..!

వేములవాడ: ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని గుడి చెరువు ప్రక్షాళనలో భాగంగా చేపట్టిన మురుగు మళ్లింపు పనులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురుకావడంతో పనులు గత కొన్ని రోజులుగా నిలిచి పోయాయి. పట్టణంలోని కట్టుకాలువ నుంచి వచ్చే మురుగునీరు గుడి చెరువులో కలిసి నీరు కలుషితం అవుతుండటంతో ఈ మురుగునీటి మళ్లింపు పథకానికి అధికారులు రూప కల్పన చేశారు. ఇందుకు ప్రభుత్వం రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో గత రెండు నెలల క్రితం పైపులైన్ నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. దాదాపు 2.3 కిలో మీటర్ల పొడవునా పనులు చేయాల్సి ఉంది. మొదటి బైపాస్ రహదారి నుంచి ఆలయ పార్కింగ్ ప్రాంతం మీదుగా వీఐపీ రోడ్డు వరకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. భగవంతరావునగర్ నుంచి న్యూఅర్బన్ కాలనీ వరకు పైపులైన్ వెళ్లే ప్రాంతంలోని గుడి చెరువు ఎఫ్‌టీఎల్ బాధితులు పలుమార్లు అభ్యంతరం చెప్పడం, అడ్డుకోవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది.

**ఎఫ్‌టీఎల్‌లో భారీగా ఆక్రమణలు**

గుడి చెరువులో భారీగా ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) ప్రాంతాన్ని కొంత మంది ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించారు. చాలా ఏళ్ల క్రితమే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు హద్దురాళ్లను ఏర్పాటు చేసినప్పటికీ హద్దులు తొలగించి కొందరు అక్రమార్కులు ఎఫ్‌టీఎల్‌లో ప్లాట్లుచేసి విక్రయించారు. పలువురు భవనాలు సైతం నిర్మించారు.



ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో ఇప్పుడు ఇది సమస్యకు దారి తీసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. డబ్బులు వెచ్చించి పాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిఏటా వర్షాకాలంలో మల్లారం మూలవాగు మత్తడి నుంచి భీమేశ్వర ఫీడర్ ఛానల్ ద్వారా వచ్చే వాననీటితో పాటు న్యూఅర్బన్ కాలనీ, భగవంతరావునగర్ ప్రాంతాల వైపు నుంచి వచ్చే మురుగునీరు కట్టుకాలువ ద్వారా పారుతూ గుడి చెరువులో కలుస్తోంది. దీంతో గుడి చెరువులోని నీటిని స్థానికులు, భక్తులు వినియోగించడానికి వీలు లేకుండా పోతోంది. దీనిని ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో మురుగు మళ్లింపు పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు పూర్తయితే గుడి చెరువునీరు కలుషితం అయ్యే అవకాశం లేదు. **త్వరలో పనుల మొదలు–అన్వేష్, మున్సిపల్ మిషనర్ వేములవాడ** మురుగు నీరు మళ్లింపు పైపులైన్ నిర్మాణం పనులు రెండు మూడు రోజుల్లో మొదలవుతాయి. ఒకరిద్దరు వ్యక్తులు పైపులైన్ నిర్మాణ పనులకు అభ్యంతరం తెలిపారు.. నిబంధనల మేరకు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించిన హద్దుల ప్రకారమే పైపులైన్ నిర్మాణ పనులు చేపడతాం.

# సరిహద్దు.. తేలని పద్దు



బషీరాబాద్: తెలంగాణ–కర్ణాటక అటవీశాఖ పరిధిలోని సరి'హద్దు' సమస్య ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇన్నాళ్లు మండల స్థాయి అధికారుల నివేదిక కోసం వేచి చూసిన ఇరు రాష్ట్రాల అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు.. సర్వే నివేదిక, కబ్జాకు గురైన ఎకరాలు తేలినా.. జిల్లా స్థాయి అధికారులు స్పందించడం లేదు. వికారాబాద్, కర్ణాటక రాష్ట్రం కలుబురిగికి జిల్లా కలెక్టర్లు సంయుక్తంగా కలిస్తేనే అటవీభూమిలో హద్దులు పాతే అవకాశం ఉంది. ప్రస్తుతం వేసవి కావడంతో అటవీ భూములకు చొచ్చుకొచ్చి కబ్జాలకు పాల్పడుతున్నారు.

**ఆక్రమణలు ఎక్కువే..:** బషీరాబాద్ మండల పరిధి మైల్వార్ అటవీ ప్రాంతంలో సర్వే సంఖ్య 218/1, 235, నీళ్లపల్లిలో సర్వే సంఖ్య 35, ఇస్మాయిల్‌పూర్‌లో సర్వే సంఖ్య 20, జలాల్‌పూర్‌లో సర్వే సంఖ్య 69 భూమిలో మొత్తం కలిపి 737 ఎకరాల అటవీ భూమి కబ్జాకు గురైనట్లు ఇటీవల తాండూరు రేంజ్ అటవీశాఖ, బషీరాబాద్ రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేసి లెక్కలు తేల్చారు.

**కేసులు నమోదు చేసినా ఫలితం లేదు**

అటవీ భూమిలో కబ్జాలకు పాల్పడిన కర్ణాటక, తెలంగాణకు చెందిన కబ్జాదారులకు బషీరాబాద్ అటవీశాఖ అధికారులు పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేకపోయింది. ఇరు రాష్ట్రాలకు చెందిన సుమారు 30 మంది రైతులపై కేసులు నమోదు చేయగా.. కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.

**మంత్రి, ఎమ్మెల్యే హామీ ఇచ్చినా అధికారుల్లో కనిపించని స్పందన**

ఇటీవల బషీరాబాద్‌కు వచ్చిన సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అటవీశాఖ, రెవెన్యూ పరిధిలోని అటవీ భూమిని త్వరలో సర్వే చేస్తామని చెప్పారు.. అక్కడే ఉన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు సైతం వివరించారు. కర్ణాటక కలెక్టర్‌కు సమాచారం అందించి పక్కాగా నక్షాలతో సర్వే చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈమేరకు ఇక్కడి అటవీ అధికారులు కర్ణాటక కలిబురిగి జిల్లా కార్యాలయానికి వెళ్లి రాతపూర్వకంగా సంయుక్త సర్వేకు విన్నవించారు. నాలుగు నెలలు దాటినా నేటికీ ఎలాంటి పురోగతి లేదు. అధికారులు స్పందించడంలేదు.

**ఉన్నతాధికారులకు వివరించాం**

శ్రీదేవి సరస్వతి, అటవీశాఖ రేంజ్ అధికారిణి, తాండూరు

కర్ణాటక రైతుల కబ్జాలకు సంబంధించి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. ఈ వ్యవహారం కొన్నేళ్ల నుంచి కొనసాగుతోంది. ఇరు రాష్ట్రాల అధికారులు కలిసి సంయుక్త సర్వే చేసి హద్దులు పాతితే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

బషీరాబాద్ పరిధి అటవీ భూమి.. 2,981 ఎకరాలు

కబ్జాకు గురైంది.. 737 ఎకరాలు

కేసుల నమోదు.. 30 మంది రైతులు

ప్రస్తుతం.. కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు

# కొనుగోళ్లలో జాప్యం.. రైతన్నకు శాపం



గంగాధర: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు అరిగోస పడుతున్నారు. సాగు మొదలుకొని అడుగడుగునా కష్టనష్టాలతో ఉక్కిరిబిక్కిరైన రైతులు తీరా చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తూకాల్లో తీవ్ర జాప్యంతో ఆందోళనకు గురవుతున్నారు. మబ్బులు పట్టిన ఆకాశం.. ఎప్పుడు అకాల వర్షాలు కురుస్తాయోనన్న ఆందోళన వెంటాడుతోంది. వీటికితోడు కేంద్రాల్లో కనీస వసతుల్లేక రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్దే నిరీక్షిస్తున్నారు.

**అంచనాకు మించి దిగుబడి..**

కేంద్రాల ప్రారంభంలో చూపించిన ఉత్సాహం ధాన్యం తూకంలో చూపించడంలేదు. ఫలితంగా ఒక్కో కేంద్రంలో వారం పది రోజులైనా ధాన్యం తూకం జరగక మండుతున్న ఎండల్లో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎకరాకు యాసంగిలో గతంలోనైతే 30 క్వింటాళ్లకు మించి దిగుబడి రాకపోవడంతో దిగుబడులు ఈసారి కూడా అంతే మొత్తంగా వస్తాయని అంచనా వేశారు. కానీ క్షేత్రస్థాయిలో 35 క్వింటాళ్లకు మించి దిగుబడులు వస్తుండగా రైతులు ఓ పక్క సంతోషపడుతున్నా కొనుగోళ్లలో జాప్యంతో ఆనందం లేకుండా పోతుంది. గంగాధర మండలం న్యాలకొండపల్లి శివారులో ధాన్యం పండించిన రామడుగు మండలం పందికుంట రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో ఇబ్బందిగా మారిందని కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

**హమాలీల కొరత..**

వాస్తవానికి గతంలోనైతే స్థానికంగా ఉన్న హమాలీలనే వినియోగించే వారు కానీ.. ప్రస్తుతం వరి సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరగడంతో గడిచిన అయిదేళ్లుగా బిహార్ నుంచి హమాలీలను రప్పిస్తున్నారు. మార్చి నెలాఖరు నుంచే వరి కోతలు మొదలు కాగా ఏప్రిల్ 15 వరకు కూడా కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి.

వేసవిలో మండుతున్న ఎండలతో ధాన్యం తేమ శాతం 17 వస్తుండగా తూకం వేయొచ్చు. కానీ హమాలీల కొరత, కాంటాల మొరాయింపు, బారదాన్‌లు చాలక జిల్లాలోని చాలా కేంద్రాల్లో తూకం నత్తనడకన సాగుతున్నాయి.

జిల్లాలో ఇప్పటివరకు కేవలం 20 శాతం మాత్రమే కొనుగోలు జరిగినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో రైతులు కేంద్రాల్లో పడిగాపులు పడే బదులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకే ధాన్యం విక్రయించుకుంటున్నారు.

గోదాముల వద్ద పోసిన ధాన్యం 10 రోజులు గడిచినా తూకం వేయడానికి హమాలీలు రావడంలేదని వాపోయారు. ఇక పెద్ద రైతులకు చెందిన ధాన్యం తూకం వేస్తే చిన్న, సన్నకారు రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. హమాలీలు, కాంటాల సంఖ్య పెంచి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

జిల్లాలో యాసంగి సాగు వివరాలు..

కొనుగోలు కేంద్రాలు : 336

దొడ్డురకం సాగు ఎకరాల్లో : 2,66,896

ధాన్యం అంచనా : 4,57,817 మె.ట

సన్నవి ఎకరాల్లో : 67,845

ధాన్యం అంచనా : 1,28,906 మెట్రిక్ టన్నులు

# తాగునీటికి తండ్లాట

నల్గొండ : వేసవికాలం తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోని పానగల్ ఉదయ సముద్రం ప్రాజెక్టు నీటి శుద్ధికేంద్రం నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తున్నా.. నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు చెబుతున్నారు. పానగల్ ప్రాజెక్టు నుంచి నల్గొండ, నకిరేకల్, మునుగోడు, యాదాద్రి జిల్లాలోని 578 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని నల్గొండ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. నకిరేకల్ మండలంలో మిషన్ భగీరథ గొట్టపుమార్గం నిడివి 124 కి.మీ ఉండగా 7,956 కుళాయిలున్నాయి. 17 గ్రామ పంచాయతీల్లో నిత్యం 3.5 ఎంఎల్‌డీల తాగునీరు అవసరం కాగా ప్రస్తుతం 3.4 ఎంఎల్‌డీలు సరఫరా చేస్తున్నారు. నకిరేకల్ పురపాలిక పరిధిలో 80 శాతం గృహాలకు భగీరథ నల్లా కనెక్షన్లు లేవు. వీరు ప్రజా కుళాయిల నీటిని పట్టుకొని నిల్వ చేసుకుంటున్నారు. మొత్తం 8 వేలకుపైగా గృహ కనెక్షన్లుంటే 2వేల ఇళ్లకే భగీరథ కనెక్షన్లున్నాయి. ప్రస్తుతం అమృత్ పనులు కొనసాగుతున్నాయి.

దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో మిషన్‌భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేయడం లేదు. చేతిపంపులు, డబ్బా నీళ్లను తాగుతున్నారు. చందంపేట మండలం కృష్ణా ఎగువ ప్రాంతంలో భగీరథ నీరు అందక ఆయా గ్రామాలకు బోరు నీళ్లే దిక్కవుతున్నాయి. చిట్యాల పురపాలిక పదోవార్డు పరిధిలో శివనేనిగూడెం వెళ్లే పాతదారిలో శివాలయం నుంచి సుందరయ్యనగర్ కాలనీ వరకు భగీరథ నీరు ఇంటింటికి సరఫరా చేయడం లేదు. నామమాత్రంగా ప్రజా కుళాయిలు ఏర్పాటుచేశారు. శివాలయం వీధిలో సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. జమ్మినగర్‌కాలనీకి పైపులైన్ వేసి వదిలేశారు. వెంకటాపురంలో సాధారణ నీటితో కలిపి భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని పాతబస్తీ ప్రజలు మిషన్ భగీరథ నీటి అస్తవ్యస్త సరఫరా మూలంగా కొండచెలిమ బావి నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. పానగల్ రోడ్, లెప్రసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, గొల్లగూడ, రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. కత్తాల్‌గూడలో భగీరథ నీరు రాకపోవడంతో బోరు నీటిని తాగుతున్నారు. ఇదే విషయాన్ని పుర కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌తో ప్రస్తావిస్తే పురపాలిక పరిధిలో 37 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కొండచెలిమ నుంచి స్థానికులు కొందరు తరాల నుంచి ఈ నీటినే తాగుతున్నామని తీసుకెళుతున్నారని.. అక్కడక్కడ నీటిబిల్లులు చెల్లించని వారికి సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు.

# చిన్నబోతున్న సన్నవడ్లు

ఎల్లారెడ్డిపేట: గత వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500ల చొప్పున ప్రభుత్వం బోనస్ చెల్లించింది. దీనివల్ల సన్నరకాలు సాగుచేసిన రైతులకు కొంత మేర ఆర్థికంగా కలిసివచ్చింది. సర్కారు ఇచ్చే బోనస్ ఆశతో ఈ యాసంగిలోనూ సన్నరకం వరిసాగుపై అన్నదాతలు మొగ్గు చూపారు. కాగా వరికోతలు పూర్తిచేసుకొని కొనుగోలు కేంద్రాలకు తరలించిన సన్నరకం ధాన్యం చిన్నబోతోంది. ప్రస్తుతం దొడ్డురకాలను మాత్రమే అధికారులు సేకరిస్తుండగా సన్నరకం ధాన్యం తూకాల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 60 మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లను మాత్రమే తూకం వేశారు. బస్తాలను రైస్‌మిల్లులు, గోదాంలకు తరలించాల్సి ఉంది. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్న ప్రస్తుత తరుణంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి దొడ్డురకాలతోపాటు సన్నరకం ధాన్యం తూకాలను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

**17,505 ఎకరాల్లో సన్నరకం**

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1,60,845 ఎకరాల్లో దొడ్డు, 17,505 ఎకరాల్లో సన్నరకం వరిని రైతులు సాగుచేశారు. ఈ లెక్కన 4,02,112 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 36,760 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ధాన్యం సేకరణకు గాను జిల్లాలో మొత్తం 246 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం భావించింది. అత్యధిక కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలోని మహిళా సంఘాలకు



అప్పగించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 238 కేంద్రాల నుంచి ఈ నెల 25 వరకు 22,731 మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశారు. చాలా వరకు రైతులు అకాల వర్షాల భయంతో రైస్‌మిల్లుల్లో నేరుగా దొడ్డురకం ధాన్యాన్ని తక్కువ ధరకే విక్రయించారు. సన్నరకాలను మాత్రం కొనుగోలు కేంద్రాలకు తరలించారు.

**తరుగు వస్తే రైతులకు నష్టం**

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు తీసుకొచ్చిన సన్న ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. ఎండల తీవ్రత రానురానూ పెరిగిపోతోంది. నిర్ణీత తేమశాతం వచ్చేంత వరకు ఆరబెట్టి, కుప్పగా చేశారు. కాగా ధాన్యం తూకాలు, తరలింపులో జాప్యం వల్ల వడ్ల బరువు మరింత తగ్గిపోయే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో తరుగు ఏర్పడితే రైతులే నష్టపోవాల్సిన పరిస్థితి. ఒకవేళ అకాల వర్షాలు పడితే ధాన్యం తడిసిపోతుందని, దీంతో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

# భారం కాదు.. సారమే

ధర్మారం: యాసంగి వరి కోతలు జోరందుకోగా వానాకాలం సాగు సన్నద్ధతలో భాగంగా పొలాల్లోని గడ్డికి, వ్యర్థాలకు నిప్పంటిస్తుండటం ప్రమాదాలకు దారి తీస్తోంది. భగభగమంటున్న ఎండలతో మంటలు వేగంగా విస్తరిస్తున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు లేస్తున్నాయి. నిప్పు ఎలా రాజుకున్నా రైతులకు ఆర్థికంగా నష్టంతో పాటు భూసారం దెబ్బతింటోంది.

అదుపులోకి తేవడం కష్టమే

ఈ నెల 23న ధర్మపురి శివారులో ఓ రైతు పంట వ్యర్థాలను కాల్చివేసేందుకు నిప్పు పెట్టగా సమీపంలోని కోతకు వచ్చిన మొక్కజొన్న చేనుకు నష్టం జరిగింది.

ఈ నెల 24న రామగిరి మండలం కల్వచర్లలోని పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడంతో పశుగ్రాసం కట్టలు కాలిపోయాయి.

అదే రోజు ముత్తారం మండలం ఓడేడ్‌లోని పొలాల్లో ప్రమాదవశాత్తు మంటలు లేచి పశుగ్రాసం దగ్ధమైంది.

2019 మే నెలలో రామగిరి మండలం లొంకకేసారంలో జరిగిన ప్రమాదంలో చంద్రయ్య, శ్రీనివాస్ తదితర రైతులకు చెందిన ఆరు ఎకరాల కోతకు వచ్చిన వరి పొలం, 150 ఎకరాల్లో పశుగ్రాసం కాలిపోయాయి. పదుల సంఖ్యలో పంపుసెట్లు, విద్యుత్తు తీగలు, పైపులైన్లు దగ్ధమయ్యాయి.

అయిదేళ్ల కిందట ధర్మారం మండలం కొత్తపల్లిలో రాత్రి సమయంలో పొలాల్లో మంటలు వ్యాపించాయి. పొలాల్లో తాత్కాలిక పాకలు వేసి కట్టేసిన అజ్మీరా రాజేశం, శంకర్, వాలునాయక్‌లకు చెందిన ఎనిమిది ఆవులు గాయపడ్డాయి.

అదే ఏడాది ధర్మారం మండలం దొంగతుర్తిలో మెరుగు శంకరయ్య, కొమురయ్యలకు చెందిన వరి కుప్పలు కాలిపోయి, రూ.1.20 లక్షల నష్టం జరిగింది.

అవగాహనతోనే ప్రయోజనం

పొలాల్లో గడ్డికి నిప్పంటించడం వల్ల భూమి భౌతిక స్థితి దెబ్బతింటుంది.

పంట ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడే సేంద్రియ కర్బనం, నత్రజని, సూక్ష్మ పోషకాలు పూర్తిగా నశిస్తాయి.

గడ్డిని కాల్చివేయడం వల్ల పంటలో కలుపు తగ్గుతుందని భావిస్తున్నారు. అయితే కలుపు మొక్కలే కాదు. పంట కూడా సరిగ్గా ఎదగదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

నేలకు మేలు చేసే వానపాములు, మైత్రి పురుగులు నశించి పంట ఎదగక దిగుబడి తగ్గుతుంది.

వరి గడ్డి, ఇతర పంట వ్యర్థాలను కాలుస్తుండటంతో కార్బన్ మోనాక్సైడ్ విడుదలై వాయు కాలుష్యానికి కారణమవుతోంది.

ఎండకు మంటలు వేగంగా విస్తరించి పక్కనున్న పొలాలకు వ్యాపిస్తాయి. ఆస్తి నష్టం కూడా కలుగుతుంది. వ్యవసాయ బావుల వద్ద పంపుసెట్లు, పైపులైన్లు కాలుతున్నాయి.

పొగతో శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుంది.

నేలలో కలిసిపోతే పంటకు ఎరువు

–డా.వై.వెంకన్న, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరి

వరి గడ్డిని, వ్యర్థాలను పొలంలో కలియ దున్నడంతో నేల సారవంతమై సూక్ష్మ పోషకాల స్థాయి పెరుగుతుంది. భూమి పైపొరలో కేవలం 10, 15 సెంటీమీటర్ల లోతులోనే పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులుంటాయి. మంటల ద్వారా అవి నశించి పంట ఎదగదు. పంట వ్యర్థాలు త్వరగా భూమిలో కలిసిపోయేందుకు ద్రావణాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పిచికారీ చేస్తే వారంలో కుళ్లిపోయి ఎరువుగా మారుతుంది. ఎకరాకు రూ.100 మాత్రమే ఖర్చవుతుంది. దుక్కిలో సింగిల్ సూపర్‌పాస్ఫేట్‌ను చల్లుకోవాలి.

**ఎకరాకు 5 బస్తాల దిగుబడి పెరిగింది**– ముత్యాల చంద్రశేఖర్, రైతు, దొంగతుర్తి

అందరి లాగానే నేను కూడా గడ్డికి నిప్పంటించేవాడిని. రెండేళ్లుగా పొలంలోనే కలియదున్నుతున్నాను. మిగతా వారి కంటే ఎకరాకు కనీసం 5 బస్తాల దిగుబడి ఎక్కువగా వస్తోంది. వరి గడ్డి కుప్పలు ఎక్కువగా ఉన్నప్పుడు కట్టలు కట్టించి పాడి పశువులున్న వారికి ఇస్తున్నా. పొలంలో మిగిలిన గడ్డిని, వరి కుదుళ్లను కలియదున్నాక సింగిల్ సూపర్ పాస్ఫేట్ చల్లుతాను. మా ఊరిలో చాలా మంది ఇలాగే చేస్తున్నారు.

# పరిధి మార్పు.. సేవలు సులభం

గోదావరిఖని: ప్రజలకు పోలీసుల సేవలు అందుబాటులో ఉండేలా ఆ శాఖ చర్యలు తీసుకుంటోంది. పరిపాలన సౌలభ్యం కోసం పోలీసు శాఖ ఠాణాల పరిధి మార్పుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించింది. కొన్ని ప్రాంతాలు సమీప ఠాణాలకు దగ్గర ఉన్నా వాటి పరిధి మాత్రం దూరంలోని పోలీసుస్టేషన్‌లో ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక ఠాణా నియోజకవర్గం పరిధిలో ఉండగా సర్కిల్ మరో నియోజకవర్గం పరిధిలో ఉండటంతో పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో కొన్ని ఠాణాలకు అందుబాటులోని ప్రాంతాలను కలుపుతూ వాటి పరిధిలో కొన్ని మార్పులు చేస్తూ ప్రతిపాదనలు పంపారు. దీంతో అందుబాటులో ఉన్న ఠాణాల పరిధిలోకి ఆయా ప్రాంతాలను చేర్చడం ద్వారా సేవలు వేగంగా అందించే అవకాశం ఉంది. దానికి అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేసినట్లు సమాచారం.

**గోదావరితీరం ఒకటో ఠాణాకు..**

ప్రస్తుతం గోదావరిఖని రెండో ఠాణా పరిధిలోని గోదావరి తీరం, కోల్‌బెల్ట్ వంతెన, జనగామ, సమ్మక్క సారలమ్మ జాతర, గంగానగర్ శివారు ప్రాంతాలను ఒకటో ఠాణా పరిధిలోకి మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. రెండో ఠాణా యైటింక్లైన్‌కాలనీలో ఉండటంతో ఆయా



ప్రాంతాల్లో ఏదైనా సంఘటన చోటుచేసుకుంటే రావడానికి సమయం పడుతుంది. ఆ ప్రాంతాలను పక్కనే ఉన్న ఒకటో ఠాణాలో విలీనం చేయడం ద్వారా సకాలంలో అధికారులు చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతర్గాం ఠాణా పరిధిలో ఉన్న కుందనపల్లి, లింగాపూర్, మల్యాలపల్లి, బసంత్‌నగర్ రైల్వేపై వంతెన రాజీవ్‌రహదారిని రామగుండం ఠాణా పరిధిలోకి తీసుకురావడానికి అధికారులు ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. రామగుండం ఠాణాకు పక్కనే ఉండే ఈ గ్రామాలు ఇందులో కల్పడం ద్వారా సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నారు.

**ఒకే సబ్ డివిజన్ కిందికి..**

పెద్దపల్లి, గోదావరిఖని సబ్ డివిజన్‌ల పరిధిలో ఆయా నియోజకవర్గాల ప్రాంతాలు ఉండే విధంగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలుస్తోంది. రామగుండం నియోజకవర్గం పరిధిలో ఉన్న బసంత్‌నగర్ ఠాణా పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఉంది. ఠాణా పరిధిలోని గ్రామాలు మాత్రం రామగుండం నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. దీంతో బసంత్‌నగర్ పరిధి రామగుండం నియోజకవర్గంలోని గ్రామాలను గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఠాణా పరిధిలో మంథని, పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలకు చెందిన గ్రామాలున్నాయి. బసంత్‌నగర్ పోలీసుస్టేషన్ పెద్దపల్లి సర్కిల్‌తో పాటు అదే సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. దీన్ని రామగుండం సర్కిల్‌తో పాటు గోదావరిఖని సబ్ డివిజన్‌లో కలిపేందుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిసింది. బసంత్‌నగర్ ఠాణా పరిధిలో ప్రస్తుతం పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన రాఘవాపూర్, సబ్బితం, రంగాపూర్, అందుగులపల్లి, అప్పన్నపేట, బొంపల్లి గ్రామాలున్నాయి. ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండేడ, మంథని పరిధిలోని కన్నాల, రాణాపూర్ గ్రామాలున్నాయి.

# చిన్నబోయిన చిరు వ్యాపారి

కరీంనగర్ : చిరు, వీధి వ్యాపారులకు అందించే ప్రధానమంత్రి స్వనిధి రుణాల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. జిల్లాలోని నగర, మున్సిపాలిటీల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే వీధి వ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తోంది. కరోనా లాక్‌డౌన్ నుంచి దీన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద గుర్తించిన వీధి వ్యాపారులకు మొదటి విడతలో లబ్ధిదారుడికి రూ.10 వేల రుణం అందజేస్తారు. ఈ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా నేరుగా ఖాతాలో జమ చేస్తారు. చిన్న వ్యాపారులకు ఈ మొత్తం ఎంతగానో ఉపయోగపడేది.

**మూడో విడతకు ఎదురుచూపులు**

ఐదేళ్ల కిందట ప్రతి వీధి వ్యాపారికి రూ.10 వేలు ఖాతాలో జమ చేయగా.. ఈ మొత్తాన్ని ఏడాదిలోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించిన వారికి మళ్లీ రుణం తీసుకోవడానికి వీలు కలిగేది. రెండో విడతలో



రూ.20 వేలు అందించగా.. మూడో విడతలో రూ.50 వేలకు పెంచారు. రుణ మొత్తం పెరుగుతుండటం, వ్యాపారాభివృద్ధికి తోడుగా ఉండటంతో రుణం తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకర్లు సైతం ఈ రుణాలు సక్రమంగా చెల్లించినవారికి అందించేందుకు ముందుకొచ్చారు. మూడు నెలలుగా రుణాలు అందించడంలేదు.

**కొత్త పథకం కోసమేనా?**

ఆత్మనిర్భర్ కింద రుణాలు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించి మరీ రుణాలు అందిస్తుండగా.. ఇటీవల కొత్త పథకం అమలు చేసేందుకు వీలుగా సాంకేతికపరంగా ఐచ్ఛికం ఇవ్వకపోవడంతో పాతవారికి కూడా రుణాలు అందించేందుకు బ్రేక్ పడింది. కొత్త పథకం అమలు చేసేంత వరకు పీఎం స్వనిధి పథకం నిలిచిపోయినట్లుగానే చెబుతున్నారు. అయితే వీధి వ్యాపారులకు రూ.50 వేల వరకు ఇస్తున్న రుణాన్ని రూ.లక్షకు పెంచితే ఆర్థిక అవసరాలు తీరడంతోపాటు ఉపాధి పెరిగి జీవన ప్రమాణాలు పెరగనున్నాయి.

# పర్యాటక సిరి.. ఆదాయంపై గురి



హైదరాబాద్: నగరంలోని హుస్సేన్‌సాగర్ పరిసరాలైన ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్డు, లుంబిని పార్కు, ఐమాక్స్ థియేటర్ల వద్ద నిత్యం సందడి కనిపిస్తుంటుంది. శని, ఆదివారాల్లో పర్యాటకుల సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటోంది. పర్యాటకాన్ని ఆదాయ వనరులుగా మార్చుకునేందుకు ట్యాంక్‌బండ్ చుట్టూ హెచ్‌ఎండీఏ పలు వాణిజ్య కూడళ్లను నిర్వహిస్తోంది. చాలా ఏళ్లుగా వాటిని లీజు, అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని పొందుతోంది. పలువురు లీజుకు, అద్దెకు తీసుకొని తర్వాత చెల్లింపులు చేయక ఎగవేస్తున్నారు. ఇప్పటికే అధికారులు కొన్ని లీజులను రద్దు చేశారు. తాజాగా హుస్సేన్‌సాగర్ చుట్టూ 20 వరకు వాణిజ్య కూడళ్లను గుర్తించి వాటిని తిరిగి అద్దెకు ఇచ్చేందుకు హెచ్‌ఎండీఏ కసరత్తు చేస్తోంది. త్వరలో వీటికి టెండర్లు పిలిచేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఐమాక్స్, ఎన్టీఆర్ మెమోరియల్ పార్కింగ్, లుంబిని పార్కు రెస్టారెంట్, క్లోక్‌రూంలు, సంజీవయ్య పార్కు వద్ద వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించి అద్దెలకు ఇచ్చేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు.

**ఎగవేతదారులపై చర్యలేవీ?**

గతంలో పేరుకుపోయిన అద్దెల వసూళ్లపై హెచ్‌ఎండీఏ తగిన శ్రద్ధ చూపటం లేదు. గతంలో హెచ్‌ఎండీఏ నుంచి వాణిజ్య ప్రదేశాలను అద్దెలకు తీసుకొని అద్దెలు చెల్లించకుండా రూ.కోట్లు ఎగవేసిన వారిపై చట్టపరమైన చర్యలు లేకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగించినట్లు అధికారులు చెబుతున్నా.. పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రాలేదు. దీంతో తమకేం కాదనే ధీమాతో ఎగవేతదారులు తిరిగి మరో రూపంలో హెచ్‌ఎండీఏ టెండర్లను దక్కించుకోవడానికి సమయాత్తమవుతున్నట్లు తెలుస్తోంది. లుంబిని పార్కులో గతంలో రెస్టారెంట్ నిర్వహించి, రూ.1.5 కోట్లకు బకాయి పెట్టి బోర్డు తిప్పేశారు. ఐమాక్స్ వద్ద హెచ్‌ఎండీఏ పార్కింగ్ బకాయిలు కూడా రూ.45 లక్షలకు చేరడంతో నిర్వాహకులు తప్పుకొన్నారు. డిపాజిట్లకు మించి బకాయిలు పెరుగుతున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పేరుకున్న బకాయిలు ఇలా...(రూ.ల్లో)

ఐమాక్స్ వద్ద పార్కింగ్‌- 45 లక్షలు
లుంబిని పార్కు రెస్టారెంట్‌- 1.5 కోట్లు
ఎన్టీఆర్ మార్గ్ క్లోక్‌రూం- 16 లక్షలు
ఎన్టీఆర్ మెమోరియల్ పార్కింగ్‌- 21 లక్షలు
లుంబిని పార్కు క్లోక్‌రూం- 11 లక్షలు

# పారిశ్రామిక వాడ.. ప్రగతి జాడ



తాండూరు : తాండూరు పరిధి జిన్‌గుర్తి పారిశ్రామికవాడలో పనులు వడివడిగా సాగుతున్నాయి. వేలాది పరిశ్రమలు ఒక్కచోటుకి చేరనున్నాయి. అందుకు అనుగుణంగా ఒక్కొక్కటిగా సదుపాయాలు సమకూరుతున్నాయి. తొలుత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా పనులు మేలో పూర్తి కానున్నాయి. నెలరోజుల్లో తారు రహదారులు అందుబాటులోకి రానున్నాయి.

**వాణిజ్య కేంద్రంలో తొలిసారిగా ఏర్పాటు**

జిల్లాలో వాణిజ్య కేంద్రమైన తాండూరు మండలంలో తొలిసారిగా పారిశ్రామికవాడ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. దీంతో దశాబ్దాలుగా ఉన్న డిమాండ్ కార్యరూపం దాల్చబోతోంది. జిన్‌గుర్తి పరిధిలోని 216 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి పారిశ్రామిక వాడకు కేటాయించారు. దీంతో టీఎస్‌ఐఐసీ మౌలిక సదుపాయాల కల్పనకు నడుం బిగించింది. తొలుత పారిశ్రామికవాడ ప్రాంతంలో రహదారులు నిర్మించేందుకు ఖరారు చేసింది. గతేడాది పనులు చేపట్టగా ఎర్రమట్టి మొరం పనులు పూర్తయ్యాయి. తాజాగా కంకర పరిచే పనులు నిర్వహిస్తున్నారు.

**సదుపాయాలుంటే తరలనున్న పరిశ్రమలు**

మౌలిక సదుపాయాల కల్పన పూర్తయితే నియోజకవర్గంలోని వేయికిపైగా ఉన్నా నాపరాయి పరిశ్రమలన్నింటినీ పారిశ్రామిక వాడలోకి తరలించనున్నారు. నాపరాయి కొనుగోలుదారులు నాణ్యత, ధరలను పరిశీలించి కొనేందుకు సౌకర్యంగా మారుతుంది. చెంతనే జాతీయ రహదారి ఉండటంతో ఎగుమతులకు, దిగుమతులకు సౌలభ్యంగా మారుతుంది. దీంతో రవాణా ఇబ్బందులు తొలగుతాయి. ఇంజనీరింగ్, వెల్డింగ్ వర్క్స్, గిట్టీల తయారీ వంటి పరిశ్రమలను సైతం పారిశ్రామికవాడకు తరలించనున్నారు.

**త్వరలో విద్యుద్దీకరణ పనులు**

రహదారుల నిర్మాణం పూర్తవగానే విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు టీఎస్‌ఐఐసీ అధికారులు ఖరారు చేశారు. పారిశ్రామిక వాడలోనే విద్యుత్తు ఉపకేంద్రాన్ని నిర్మించగా గతేడాది రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఇక్కడి ఉపకేంద్రం ద్వారా పారిశ్రామికవాడలో కొత్తగా వందల సంఖ్య విద్యుత్తు స్తంభాలు అమర్చి, తీగలు వేసి నియంత్రికలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రదేశం: జిన్‌గుర్తి
విస్తీర్ణం: 261 ఎకరాలు
మంజూరైన నిధులు: రూ.30కోట్లు
పెట్టిన ఖర్చు: రూ.10కోట్లు
రహదారులు: 13 కి.మీ.
సమకూరేది: మే నెలాఖరు

# 'మహా' మార్పు.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా కర్ణన్

హైదరాబాద్: మహానగర పరిధిలో పరిపాలనా వ్యవస్థలో ప్రభుత్వం కీలక మార్పులకు నాందిపలకడంతో పాటు జీహెచ్‌ఎంసీ కమిషనర్ సహా కీలక బదిలీలు, నియామకాలు చేపట్టింది. పురపాలనలో హెచ్‌ఎండీఏ వెలుపల, హెచ్‌ఎండీఏ పరిధిలో పరిపాలనకు వేర్వేరు పురపాలక కార్యదర్శులను నియమించింది. హెచ్‌ఎండీఏ పరిధిలో పుర పాలనకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యదర్శిని నియమించింది. గతంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సహా రాష్ట్రంలో అన్ని పట్టణ స్థానిక సంస్థల పరిపాలన ఉండేది. తాజా మార్పులతో హెచ్‌ఎండీఏ పరిధిలో పురపాలనకు ప్రభుత్వం కార్యదర్శిని ప్రత్యేకంగా నియమించింది. ఫ్యూచర్ సిటీకి ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించింది.

**బదిలీలు.. నియామకాలు**

జీహెచ్‌ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి స్థానంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను నియమించింది. ఇలంబర్తిని హెచ్‌ఎండీఏ పరిధి కార్యదర్శిగా నియమించింది. ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కె.శశాంకను నియమించింది. టీజీఎంఎస్‌ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ బి.హేమంత్‌సహదేవ్‌రావును జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా నియమించింది. శేరిలింగంపల్లి జడ్‌సీ ఆర్.ఉపేందర్‌రెడ్డిని బదిలీ చేసి హెచ్‌ఎండీఏ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ చీఫ్‌రేషనింగ్ ఆఫీసర్ జి.ఫణిందర్‌రెడ్డిని బదిలీ చేసి ఆయన స్థానంలో కె.విద్యాసాగర్‌కు అదనపుబాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కదిరివన్ స్థానంలో విద్యాసాగర్‌ను నియమించింది.




**తనదైన ముద్ర వేసిన ఇలంబర్తి**

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆరు నెలలు బాధ్యతలు నిర్వహించిన ఇలంబర్తి పాలనలో తనదైన ముద్రవేశారు. ఉన్నతాధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జడ్సీలు రోజూ సాయంత్రం 4-5 గంటల మధ్య కార్యాలయాల్లో ఉండేలా చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. నకిలీ బిల్లులు, చేయనిపనులకు నిధులు వంటి అంశాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకున్నారు. జీఎస్ఐ సర్వేను వేగవంతం చేశారు.


# అందని ద్రాక్షగా ఆయుష్ సేవలు

ధర్మపురి: ప్రాచీన వైద్యాన్ని కాపాడుతూ.. రోగులకు సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయుష్ ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. ఆయుర్వేదం, యోగా, యునానీ, ఆయుష్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి వీటి ద్వారా సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ఆయుష్ దవాఖానాలు సుప్త చేతనావస్థలో కొట్టుమిట్టాడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది నియామకాలు, అభివృద్ధి చర్యలపై పట్టించుకోకపోవడంతో రోగులకు సేవలు అందటం లేదు. దీంతో ఆయా ఆసుపత్రులు అలంకారప్రాయంగానే మారాయి.

ఆయుష్ ఆస్పత్రులు జాతీయ ఆరోగ్య మిషన్ కింద మంజూరయ్యాయి. ఒక్కొక్క కేంద్రంలో ఒక వైద్యుడు, ఫార్మాసిస్టు, వాచ్‌మెన్‌లు ఉండాలి. కానీ జిల్లా అధికారులు ఒక్కరినే నాలుగైదు కేంద్రాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌ఛార్జిలు ఆయా కేంద్రాలకు వెళ్లకుండానే కాలం వెళ్లదీస్తున్నారు. ఖాళీగా ఉన్న కేంద్రాల్లో ఫార్మాసిస్టు, వాచ్‌మెన్లతోనే నడిపిస్తున్నారు.

**మొక్కుబడిగానే నిర్వహణ**

యునానీ, ఆయుర్వేద వైద్య ఆసుపత్రులను యోగా అధ్యయన కేంద్రాలుగా మార్చారు. 2022 ఆగస్టులో రూ.5 లక్షల నిధులు కేటాయించి నూతన భవనాలు నిర్మించారు. ధ్యాన కేంద్రాలకు



పంచకర్మ పరికరాలను కేటాయించారు. వ్యాయామం చేయటానికి రెండు పరికరాలు సమకూర్చారు.

ఆయుర్వేద వైద్యశాలలు(రెగ్యులర్)అల్లీపూర్, బండలింగాపూర్, చిల్వాకోడూర్, లక్ష్మీపురం మేడిపల్లి, వీవీరావుపేట, వెల్లులలో వైద్యురాలు లేక ఫార్మాసిస్టులు సేవలందిస్తున్నారు.

ఆయుర్వేద(ఎన్‌ఆర్‌హెచ్‌ఎం)

అంబారీపేట, జగ్గాసాగర్, కల్లెడ, కథలాపూర్, మెట్‌పల్లిలలో రెండేసి వైద్య సిబ్బంది పోస్టులు ఉండాల్సిన.. ఒకొక్కరు పని చేస్తున్నారు.


యునానీ కేంద్రాలు(రెగ్యులర్)

మల్యాల, కోరుట్ల, ధర్మపురి, ఎండపల్లిలలోని యునానీ ఆసుపత్రుల్లో ఒక్క వైద్యుడు లేరు. ఎండపల్లి పూర్తిగా మూతపడింది. మిగతా చోట్ల మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు.

**మందుల కొరత లేదు**– డా.శివకుమార్, జిల్లా ఆయుష్ వైద్య ప్రోగ్రాం అధికారి జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇన్‌ఛార్జులతోనే సేవలందిస్తున్నాం. ధర్మపురి లాంటి ఆసుపత్రులకు పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుతం అన్ని ఆసుపత్రులు నడిచేలా చర్యలు తీసుకుంటున్నాం. మందుల కొరత లేదు.

# కోడ్ ముగిసె.. సన్నాలకు సమయమాయె

హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా వాసులకు సన్నబియ్యం అందుబాటులోకి రానున్నాయి. గ్రేటర్‌పరిధిలోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఇప్పటికే సన్నబియ్యం పంపిణీ కాగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో పంపిణీ కాలేదు. మార్చి 24న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో హైదరాబాద్‌లో సన్నబియ్యం పంపిణీకి బ్రేక్ పడింది. ఈ నెల 25న ఓట్ల ఎన్నిక ముగిసింది. ఈ నేపథ్యంలో నగరంలోని 587 చౌక దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు



చేస్తోంది. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ (సీఆర్ఓ) పరిధిలో 6.39 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో మార్చిలోనే సన్నబియ్యం పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో మాత్రం దొడ్డు బియ్యం పంపిణీ అయింది. హైదరాబాద్ ప్రజాప్రతినిధులు సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరగా.. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు వచ్చిందని, సన్నబియ్యం పంపిణీ కోడ్ ఉల్లంఘన పరిధిలోకి వస్తుందని ఎన్నికల కమిషన్ అధికారులు వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నిక ముగియడంతో హైదరాబాద్ పరిధి రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ హైదరాబాద్ ఉన్నతాధికారి తెలిపారు.

హైదరాబాద్‌లోని చౌక దుకాణాలు: 587
మొత్తం కార్డులు: 6,39,505
నెలకు సన్నబియ్యం పంపిణీ: 14719.69 మెట్రిక్ టన్నులు

## చిన్నతరహా పరిశ్రమలకు విద్యుత్తు విఘాతం

సిరిసిల్ల : జిల్లా వస్త్రోత్పత్తి పరిశ్రమలోని ఎస్ఎస్ఐ(స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్)లను విద్యుత్తు బిల్లులు వెంటాడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం సెస్ అధికారులు పెండింగ్ బిల్లులు చెల్లించడంలేదంటూ విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. దీంతో 127 చిన్నతరహా యూనిట్ల పరిధిలో ఎనిమిదివేల మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు నిలిచిపోయాయి. వీటిపై పనిచేసే సుమారు 1600 మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. రెండేళ్లుగా విద్యుత్తు సమస్య పరిష్కారం కాకపోవడంతో సర్వీసులపై బిల్లులు పేరుకుపోతూనే ఉన్నాయి. చిన్న, మధ్యతరగతి యజమానులు కాటన్, పాలిస్టర్ వంటి ప్రైవేటు ఆర్డర్లు తెచ్చుకుని నడిపిస్తున్నారు. వాటి పెట్టుబడి కోసం చేసిన అప్పులకు తోడు.. ఇప్పుడు బిల్లుల గుదిబండలా మారిందని వస్త్రోత్పత్తిదారులు వాపోతున్నారు.

**ఎందుకీ పరిస్థితి?**

వస్త్ర పరిశ్రమలోని కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2016 నుంచి బతుకమ్మ చీరల ఆర్డర్లు ప్రారంభించింది. వీటికితోడు పాఠశాల విద్యాశాఖ, సంక్షేమశాఖల ఆర్డర్లు అన్నీ కలిపి ఏటా సుమారు తొమ్మిది కోట్ల మీటర్ల వస్త్రం ఉత్పత్తి చేయాలి. దీనికి మ్యాక్స్ సంఘాలతో లక్ష్యం చేరుకోలేని పరిస్థితి. అప్పుడు ఆర్డర్లను ఎస్ఎస్ఐ యూనిట్లకు సైతం ఇచ్చేందుకు టెస్కో, చేనేత జౌళిశాఖ నిర్ణయించింది. అలా 2016-17లో జిల్లాలో ఎస్ఎస్ఐ యూనిట్లు



విస్తరిస్తూ 127కు చేరాయి. వీటికి ఆర్డర్లు ఇవ్వడంతో ఉత్పత్తి లక్ష్యం చేరుకోవడం సులభమైంది. కాగా విద్యుత్తు కేటగిరీ.. రాయితీల విషయంలో చేనేత, జౌళిశాఖ, ఇటు సెస్ అధికారులు ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. మ్యాక్స్ సంఘాల మాదిరిగానే నాలుగో కేటగిరీలో 50శాతం రాయితీ ఇచ్చారు. మూడో కేటగిరీకి చెందిన ఎస్ఎస్ఐ యూనిట్లకు నాలుగో కేటగిరీ రాయితీ ఇవ్వడాన్ని సెస్ విద్యుత్తు వినియోగదారుల ఫోరం గుర్తించి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 2023 మార్చిలో హైకోర్టు తీర్పుతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

**పెరుగుతున్న బకాయిలు** హైకోర్టు తీర్పుతో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్ ఎస్ఎస్ఐ యూనిట్లకు 50శాతం రాయితీ వర్తించదని ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో జిల్లాలోని 127 యూనిట్ల పరిధిలోని 744 సర్వీసులకు కేటగిరి-3లో యూనిట్కు రూ.7.70 చొప్పున బిల్లులు వేస్తున్నారు. దీంతో 2023 మార్చి - ఏప్రిల్‌లోనే రూ.2034 కోట్ల బిల్లులు వచ్చాయి. దీంతో ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులు 2023 నుంచి అధికారంలోని పెద్దలను నమ్ముకుంటూ వస్తున్నారు. నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇటు సెస్ సిబ్బంది బిల్లులు నమోదు చేస్తూనే ఉన్నారు. దీంతో ప్రస్తుతం ఆ బకాయిలు మొత్తం రూ.32 కోట్లుకు చేరుకున్నాయి.

## నైపుణ్య శిక్షణ.. భవితకు నిచ్చెన

గంభీరావుపేట : ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ పట్టా ఉన్నంత మాత్రాన ఉద్యోగం వస్తుందనుకోవడం భ్రమే. చాలా సంస్థలు అభ్యర్థుల్లోని నైపుణ్యాలు చూసే అవకాశాలు కల్పిస్తున్నాయి. ఉద్యోగాలకు విపరీతమైన డిమాండ్ పెరగటంతో చదువుతో పాటు నైపుణ్య శిక్షణ అవసరం ఏర్పడింది. దీనిని గుర్తించి గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత అయిదేళ్లుగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కోర్సులు అందిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో 900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తెలంగాణ అకాడమీ స్కిల్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో కన్వీనర్ జనగామ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ రకాల వృత్తివిద్యా కోర్సుల్లో తర్ఫీదు ఇస్తున్నారు.

**ఒత్తిడి తట్టుకునేలా**

విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుని పనిచేసేలా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. నిపుణులతో అవగాహన కల్పిస్తున్నారు. ఆప్టిట్యూడ్, రీజనింగ్, గణితం సమస్యలను అతి తక్కువ వ్యవధిలో ఎలా పరిష్కరించాలో గణిత నిపుణుల ఆధ్వర్యంలో నేర్పుతున్నారు. ఈ శిక్షణ ఐసెట్‌తో పాటు వివిధ రకాల పోటీ పరీక్షల్లో సత్తా చాటేందుకు ఉపయోగపడుతుందని అధ్యాపకులు చెబుతున్నారు. పలు సంస్థలు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియల్లో నిర్వహించే ముఖాముఖిలో చాలామంది చతికిలపడుతున్నారు. ఇలాంటి వారికి ఉపయోగపడేలా



భావవ్యక్తీకరణ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నారు.

**ఉద్యోగాలకు పలువురి ఎంపిక**

టాస్క్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రైవేటు కంపెనీల ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించగా విప్రో తదితర కంపెనీలతో పాటు కాల్ సెంటర్ ఉద్యోగాలకు సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఎంపికయ్యారు.

**విద్యార్థులకు ఎంతో అవసరం**

విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్య శిక్షణ ఎంతో అవసరం. డిగ్రీ పూర్తయ్యాక వివిధ రంగాల్లో రాణించాలంటే అందుకు తగిన విధంగా సిద్ధం కావాలి. అందుకోసం టాస్క్ ద్వారా విద్యార్థులకు గత అయిదు సంవత్సరాల నుంచి శిక్షణ అందిస్తున్నాం. కళాశాలలోనే పలు కంపెనీలు ఉద్యోగ మేళాలు నిర్వహించడంతో ఇప్పటివరకు పలువురు ఉద్యోగాలు సాధించారు. విజయలక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

**సద్వినియోగం చేసుకుంటున్నారు** టాస్క్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, ముఖాముఖి, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, భాషా నైపుణ్యం, వేదికపై భయం లేకుండా మాట్లాడటం తదితర అంశాలను వివరిస్తున్నాం. ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో మెరుగైన ఉపాధి లభిస్తుంది. శ్రవణ్‌కుమార్, టాస్క్ కన్వీనర్

## అవగాహనతోనే ఆటిజం దూరం



కరీంనగర్ : పెద్దపల్లి జిల్లాకు చెందిన దంపతులకు మొదటి కాన్పులో బాబు జన్మించాడు. ఏడాది తర్వాత మాటలు సరిగా రాలేదు. కలివిడిగా ఉండకపోయేవాడు. వైద్యులను సంప్రదించగా ఆటిజంతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. జగిత్యాలకు చెందిన దంపతులకు మూడేళ్ల కూతురు ఉంది. ఆమె తోటి పిల్లలతో ఆడకపోయేది. సరిగామాటలు రాలేదు. పరధ్యానంగా కనిపించేది. ఆమె తల్లిదండ్రులు పలువురు వైద్యులను సంప్రదించగా ఆటిజం అని నిర్ధారణ అయింది. కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి వచ్చే 100 మంది పిల్లల్లో ముగ్గురు ఈ సమస్యతో వస్తున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) ప్రకారం మన దేశంలో ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు ఆటిజంతో బాధపడుతున్నారు. తల్లిదండ్రులు మేల్కొని సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీని నుంచి పిల్లలు త్వరగా బయటపడతారని తెలిపారు. రేపు ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా కథనం.

**లక్షణాలు..** జన్యుపరమైన కారణాలతోపాటు వయసు మీరిన తర్వాత పెళ్లి చేసుకోవడం, మహిళలు గర్భం దాల్చినప్పుడు ఇన్ఫెక్షన్‌కు గురికావడం, తీవ్ర ఉద్వేగాలకు లోనవడం, నెలలు నిండకుండా శిశువు పుట్టడం, తల్లిదండ్రులు సమయం కేటాయించకపోవడం, మొబైల్ తెర ప్రభావం వంటి కారణాలు ఈ వ్యాధికి దోహదమవుతాయి.

మానసిక పరిపక్వత లేకపోవడం, ఒంటరిగా ఉండటం, నేరుగా కళ్లలోకి చూడకపోవడం, సరిగా మాట్లాడకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి.

**జాగ్రత్తలు..**

ఆరు నెలలపాటు తల్లి పాలు అందివ్వాలి. పెరుగుతున్నప్పుడు అన్ని విటమిన్లు ఉండే పోషకాహారం ఇవ్వాలి. జింక్, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాలు ఇవ్వాలి.

పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలి. సాధారణంగా ప్రవర్తించకపోతే వైద్యులను సంప్రదించాలి.

పిల్లలకు మొబైల్, టీవీ తెరలు దూరంగా ఉండేలా చూసుకుంటే అదుపులో పెట్టవచ్చు.

**నెలకు ఇద్దరు, ముగ్గురు..**

సాధారణంగా 16-24 నెలల్లోపు పిల్లలు మాట్లాడాలి. సాధారణ ప్రవర్తన లేకుంటే తల్లిదండ్రులు మా వద్దకు తీసుకొస్తారు. నెలకు ఇద్దరి, ముగ్గురు ఈ సమస్యతో వస్తుంటారు. 20 ప్రశ్నల పత్రాన్ని ఇచ్చి వివరాలు రాబడతాం. నిర్ధారణ అయితే చికిత్స చేస్తాం. తల్లిదండ్రులు మూడేళ్లలోపు పిల్లలకు తగిన సమయం కేటాయించాలి. చికిత్సతో ఆటిజంను నయం చేయొచ్చు.

డాక్టర్ రాజేందర్, పిల్లల వైద్య నిపుణులు

**నిర్లక్ష్యం పనికిరాదు..**

పిల్లల విషయంలో నిర్లక్ష్యం పనికిరాదు. మూడేళ్లలోపే పిల్లలకు స్పర్శను అభివృద్ధి చేయాలి. కంటికి ఇంపైన రంగులు చూపించాలి. వినసొంపైన ధ్వనులు వినిపించాలి. భోజనం పెట్టినప్పుడు పిల్లలకు మొబైల్ చేతికిచ్చి వదిలేయకూడదు. రకరకాల వాసనలు చూపించాలి. మాటలు ఎక్కువగా మాట్లాడేలా చూడాలి. స్నానం చేయించినప్పుడు చర్మంపై ఆయిల్‌తో మసాజ్ చేస్తే మెదడుకు పదును పెరుగుతుంది.

డాక్టర్ పి.కిషన్, మానసిక వైద్య నిపుణులు

## మట్టి దందా ఆగేదెన్నడో?



పెద్దపల్లి : ఇటుక తయారీకి అవసరమయ్యే మట్టి, బూడిద కేంద్రంగా కొంతకాలంగా వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఎన్టీపీసీ సంస్థ ఉచితంగా ఇచ్చిన బూడిదకు డబ్బులు వసూలు చేస్తున్నారనే అంశం చుట్టూ వివాదం కొనసాగుతోంది. గతంలో తరలించిన చెరువు మట్టి పరిమితికి మించి వినియోగించారనే అభియోగంపై తాజాగా గనుల శాఖ దర్యాప్తును ముమ్మరం చేసింది.

**అందరి చూపు మట్టిపైనే..**

ఇటుక బట్టీలతోపాటు స్థిరాస్తి వ్యాపారులు, నిర్మాణ రంగంలో మట్టి అవసరం పెరగడంతో ఎక్కడపడితే అక్కడ మట్టి దోపిడీ జరుగుతోంది. మట్టి తరలింపు ప్రక్రియలో అనుమతి పొందిన బట్టీ నిర్వాహకులు సంబంధిత గ్రామంలోని చెరువు నుంచి మట్టిని తీసుకురావడానికి గ్రామ స్థాయి నాయకులను ప్రసన్నం చేసుకోవడంతోనే రాజకీయాలు మొదలవుతున్నాయి. మట్టి తరలించే ప్రక్రియలో కూడా యాజమాన్యం నిబంధనలను పట్టించుకోవడం లేదు. చెరువులో మీటరు లోతుకు మించి మట్టి తీయొద్దనే నిబంధన పాటించకపోవడం, పరిమితికి మించి మట్టిని తరలించడం కూడా వివాదానికి కారణమవుతోంది.

2023 వేసవిలో కొత్తపల్లి చెరువు నుంచి అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువ మట్టిని తీశారనే అభియోగంతో మైనింగ్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ పరిస్థితి కేవలం కొత్తపల్లికే పరిమితం కాలేదు కానీ.. అక్కడ వివాదం ఏర్పడడంతోనే అక్రమ దోపిడీ వెలుగులోకి వచ్చింది. పెద్దపల్లితోపాటు మంథని, కమాన్‌పూర్, సుల్తానాబాద్, పాలకుర్తి, అంతర్గాం మండలంలో కూడా నెలకొంది. గతేడాది ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ ప్రాంతం నుంచి భారీగా తరలించారు.

స్థిరాస్తి వ్యాపారులు, నిర్మాణ రంగానికి అవసరమైన వారు గుట్టలు, వాగుల చుట్టూ తిరుగుతున్నారు. వీరి తాకిడికి జిల్లాలోని పలు గుట్టలు బక్కచిక్కిపోతున్నాయి.

హుస్సేన్‌మియా వాగులోని ఇసుకను తస్కరించిన అక్రమార్కులు.. ఇసుక కింది మట్టిని కూడా వదలడం లేదు. ఇటీవల పాలకుర్తి మండలం కన్నాల గుట్ట నుంచి మట్టిని తరలించడం వివాదాస్పదం కావడంతో అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మట్టి దందాపై మైనింగ్ ఏడీ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీచోట అవసరమైన నిఘా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

**దృష్టి పెట్టాల్సిన సమయమిదే..**

వేసవి వచ్చిందంటే బట్టీలతోపాటు స్థిరాస్తి వ్యాపారానికి మట్టి అవసరం పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో అనుమతులివ్వడంతోపాటు తరలింపుపై నిఘా పెట్టాల్సి ఉంది. లేదంటే మట్టికుప్పలు, చెరువు గుంతల కొలతలు తీసుకొని జరిమానాల కోసం నిర్వాహకుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. గతేడాది విధించిన జరిమానా కూడా ఇప్పటికీ సదరు అక్రమార్కులు చెల్లించకపోవడంతో ప్రభుత్వం సైతం వారికి వన్‌టైం సెటిల్‌మెంట్ ఆఫర్ ఇచ్చే స్థాయికి వచ్చింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు అధికారులు నిబద్ధతతో నిఘా పెంచాల్సి ఉంది.

## అడుగంటుతున్న జలం..అల్లాడుతున్న జనం

ఎల్లారెడ్డిపేట : నడి వేసవికి ముందే పల్లెల్లో తాగునీటి కటకట నెలకొంది. భూగర్భజలాలు అడుగంటి పోతుండటంతో గుక్కెడు నీటి కోసం జనం అల్లాడుతున్నారు. గొంతు తడుపుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. పొద్దంతా పనులు వదిలిపెట్టుకుని బిందెడు నీటి కోసం వ్యవసాయ క్షేత్రాల వెంట పరుగులు పెడుతున్నారు. సహనం కోల్పోయి నిరసనకు దిగుతున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి ఎద్దడి గ్రామాల్లో తీవ్రమవుతోంది.

**నిర్వహణ అధ్వానం**

ఎల్లారెడ్డిపేట మండలంలోని 26 గ్రామాల్లో 46270 జనాభా ఉంది. సుమారు 39 ఓహెచ్ఎస్ఆర్, మూడు జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు ప్రజల దాహార్తిని తీర్చుతున్నాయి. భూగర్భజల మట్టాలు పాతాళానికి చేరుతుండటంతో బావులు, గొట్టపు బావుల్లో నీరు తగ్గి ట్యాంకులకు నీరందడం లేదు. కొన్ని గ్రామాల్లో మూడునాలుగు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు 500 నుంచి నాలుగు లీటర్ల శుద్ధజలాన్ని అందించే కేంద్రాలు గ్రామాల్లో ఉన్నా వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని మారుమూల గిరిజన తండాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గుండారం, తిమ్మాపూర్, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా తదితర గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఏ మూలకూ సరిపోవడం లేదని గిరిజన తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజులకోసారి అరకొరగా నీటిని వదులుతున్నారని వాపోతున్నారు. గొంతు తడుపుకోవడంతోపాటు ఇతరత్రా అవసరాలకు నీరు లేక అల్లాడుతున్నామని చెబుతున్నారు.

**అలంకార ప్రాయంగా ట్యాంకులు**

ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో గతంలో ఓహెచ్ఎస్ఆర్, సిస్టర్న్‌లను విరివిగా నిర్మించారు. ఇళ్లకు నేరుగా అందాల్సిన మిషన్ భగీరథ నీటితోపాటు గ్రామాల్లోని బోరుబావుల నుంచి వచ్చే నీటిని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల్లోకి చేర్చుతున్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులకు నీరందించే మంచినీటి బావులు, బోర్లు సైతం వట్టిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో అలంకారప్రాయంగా మారుతున్నాయి. జనాభా ప్రాతిపదికన ఒక్కో వ్యక్తికి రోజుకు 25 లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంటుంది. గతంలో అమర్చిన చేతిపంపులు ఎక్కడా కనిపించడం లేదు. తాత్కాలికంగా అమర్చిన సింగిల్‌ఫేజ్ మోటార్లు నీరు లేక మొండికేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అవి పనిచేయక పోవడంతో మరమ్మతుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య తలెత్తకుండా ప్రణాళిక

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుగానే ప్రణాళిక రూపొందించాం. బండలింగంపల్లి, దుమాల, రాచర్ల గొల్లపల్లి, గుండారం, కిష్టునాయక్‌తండాల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఓపెన్‌వెల్ మోటార్లు, బోరుబావుల తవ్వకం, పైపులైన్ ఏర్పాటు, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించి, చర్యలు తీసుకుంటాం. జోగం రాజు, ఎంపీవో, ఎల్లారెడ్డిపేట

## ఉత్పత్తి.. సంతృప్తి.. 'అంతంతే!'

కొత్తగూడెం : బొగ్గు ఉత్పత్తి సంవత్సరం ఏడు గంటలతో 2024-25 పూర్తికానుంది. షిఫ్ట్ కార్మికులు మంగళవారం ఉదయం గనుల నుంచి బయటకు రానున్నారు. రాత్రి షిఫ్టులో ఉత్పత్తి అయిన బొగ్గును నాటి ఉత్పత్తిగానే చూపనున్నారు.

**లక్ష్యాన్ని సాధించిన నాలుగు ఏరియాలు**

సింగరేణిలో మొత్తం నాలుగు ఏరియాలు 2024-25 ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని సాధించగా అందులో రెండు భద్రాద్రి జిల్లావే కావడం గమనార్హం. ఇల్లెందు ఏరియా 104శాతం, మణుగూరు ఏరియా నూరుశాతం ఉత్పత్తిలో లక్ష్యాన్ని సాధించాయి. కొత్తగూడెం ఏరియాలో సమయానికి ప్రారంభంకాని కొత్తగని (వీకేఓసీ)కారణంగా



96శాతానికి పరిమితమైంది. రామగుండం-3 ఏరియా 104శాతం, రామగుండం-1 ఏరియా నూరుశాతం లక్ష్యాన్ని సాధించగా.. రామగుండం-2 ఏరియా 99శాతం లక్ష్యాన్ని చేరుకుంది. బెల్లంపల్లి ఏరియా 97శాతం, శ్రీరాంపూర్ ఏరియా 92శాతం, అడ్రియాల 79శాతం, మందమర్రి ఏరియా 78శాతం, భూపాలపల్లి ఏరియా 75శాతం లక్ష్యాన్ని సాధించాయి.

**ఈసారి విఫలం..**

వార్షిక లక్ష్యాన్ని సాధించడంలో సింగరేణి ఈసారి విఫలమైంది. నాలుగు గనులు ప్రారంభానికి నోచుకోని కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ 96శాతం ఉత్పత్తితో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. వచ్చే ఏడాది వీకే ఉపరితలగని, రొంపేడు ఓసీ, నైనీ బ్లాకు ప్రారంభం అవుతున్నందున 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంతృప్తికరమైన బొగును ఉత్పత్తి చేస్తామని డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ తెలిపారు.

## నీరు పారకుండానే.. శిథిలమై

మెదక్ జిల్లా మాసాయిపేట మండలం హకీంపేట పరిధిలో హల్దీ వాగుపై 46 ఏళ్ల క్రితం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. ఉమ్మడి వెల్దుర్తి, చిన్నశంకరంపేట మండలాల వాసులకు ఉపయోగపడేలా, రూ.1.50 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా, 2,900 ఎకరాలకు సాగునీరు అందిస్తామని అప్పట్లో పాలకులు, అధికారులు ప్రకటించారు. ప్రధాన ఆనకట్టను 1985లో పూర్తిచేయగా, 1987 వరకు ప్రధాన కుడి, ఎడమ కాలువలు, వాటిపై నిర్మాణాలు పూర్తిచేశారు. ఇంతవరకు బాగానే ఉన్న కుడి, ఎడమ కాలువలు ఎత్తుపల్లాలుగా ఉండటం, ఎలుకపల్లి వద్ద కుమ్మరివాగుపై ఎడమ పైకాలువ, సూరారం మత్తడి పైకాలువ నిర్మాణాలు నాసిగా సాగడంతో నీరు సాఫీగా పారలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు కుడి కాలువ ద్వారా ధరిపల్లి, ఎడుమ కాలువ ద్వారా శేరిల గ్రామం దాటి నీరు



చివరి ఆయకట్టుకు చేరకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ రెండూ అధ్వానంగా మారాయి. కుడి, ఎడమ కాలువలు, కుమ్మరి వాగుపై ఎడమ పైకాలువ, సూరారం మత్తడి కాలువపై కుడి పైకాలువ పునర్నిర్మాణం, శిథిలమైన కాట్ బ్రిడ్జిలు, తూముల మరమ్మతులు, ప్రధాన ఆనకట్ట మరమ్మతులకు రూ.27 కోట్లు మంజూరు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు పదేళ్లుగా ప్రతిపాదిస్తున్నా ఇంతవరకు మోక్షం దక్కలేదు. ఇకనైనా నిధులు మంజూరు చేసి హల్దీ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## 'ట్రామా' ఏర్పాటుతోనే ధీమా

కొత్తగూడెం: రోడ్డు ప్రమాదాలు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అనేక కుటుంబాలకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నాయి. అత్యవసర వైద్యం అందుబాటులో లేక ఏటా వందలాది మంది మృతిచెందుతుండగా.. మరెందరో క్షతగాత్రులవుతున్నారు. ఈనేపథ్యంలో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించటమే కాకుండా.. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో 'ట్రామా' సెంటర్ల ఏర్పాటుకు అడుగులు పడినా వాటిని పూర్తిచేయటంలో జాప్యం నెలకొంటోంది. రాష్ట్రవ్యాప్తంగా 90 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటుచేయాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించటంతో ఉభయ జిల్లాల్లో మరికొన్నిచోట్ల వీటిని నెలకొల్పాలనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

**ఎక్కడెక్కడ అవసరం అంటే..**

ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కూసుమంచిలో 'ట్రామా' సెంటర్ ఏర్పాటుకు స్థలం సేకరించారు. వైరా సీహెచ్‌సీని ట్రామా కేర్ సెంటర్‌గా మార్చగలిగితే జిల్లా నలుమూలల నుంచి క్షతగాత్రులను ఇక్కడికి త్వరగా తరలించేందుకు అవకాశముంటుంది. సత్తుపల్లిలో ఉపరితల బొగ్గుగనులు ఉండటంతో వాహనాల రద్దీ వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయి. సత్తుపల్లిలోనూ మరో 'ట్రామా' సెంటర్ ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో ట్రామా కేర్ సెంటర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిని త్వరితగతిన పూర్తిచేయటంతో పాటు ఇల్లెందు, భద్రాచలం, మణుగూరులో 'ట్రామా' సెంటర్లు ఏర్పాటుచేస్తే క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలందుతాయి. కొత్తగూడెం-ఇల్లెందు, సారపాక-మణుగూరు మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

**ఆవశ్యకత**

ప్రమాదం జరిగిన మొదటి గంట(గోల్డెన్ అవర్)లో సరైన వైద్యమందిస్తే ప్రాణాపాయ స్థితిలోని వ్యక్తి బతికే అవకాశాలు మెరుగుపడతాయి. రోడ్డు ప్రమాదాలు, పారిశ్రామిక దుర్ఘటనలు, గృహప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మృతులు, క్షతగాత్రుల సంఖ్య అదేస్థాయిలో ఉంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో 'ట్రామా' సెంటర్లు లేకపోతే ప్రాణనష్టం, శాశ్వత అంగవైకల్యం కేసులు ఎక్కువవుతాయి. సాధారణ ఆసుపత్రులు లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తీవ్రమైన గాయాలు, బహుళ అవయవ వైఫల్యం, రక్తస్రావం వంటి అత్యవసర పరిస్థితులను సమర్థంగా నిర్వహించలేవు. 'ట్రామా' సెంటర్లలో అత్యాధునిక పరికరాలు, నైపుణ్యం కలిగిన వైద్యులు ఉంటారు. తల, వెన్నెముక దెబ్బతినటం, కాలిన శరీరం వంటి ప్రత్యేక సందర్భాల్లో సాధారణ వైద్యం సరిపోదు.




## ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ.. పుల్వామా ఘటన తర్వాత తొలిసారి

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ రోజు రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. **సూపర్ క్యాబినెట్..** సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది. అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది




విజయవాడ: తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారు కంకిపాడులో జరిగిన ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. రేవంత్, మంత్రి నారా లోకేశ్ కలిసి వివాహ వేడుక వద్దకు వచ్చారు.




ఇస్లామాబాద్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల వేళ పాక్ మంత్రి ఒకరు కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న 24-36 గంటల్లో తమ దేశంపై సైనిక చర్య చేపట్టేందుకు న్యూదిల్లీ ప్రణాళికలు రచిస్తోందన్నారు. దీనికి సంబంధించి తమకు కచ్చితమైన నిఘా సమాచారం ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నామంటూ భారత ప్రధాని మోదీ వెల్లడించిన వేళ.. పాక్ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకుంటున్న ప్రతిచర్యలపై పాక్ సమాచార శాఖ మంత్రి అతవుల్లా తరార్ అక్కసు వెళ్లగక్కారు. ఈక్రమంలోనే న్యూదిల్లీపై కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేగాక, తాము కూడా ఉగ్రవాద బాధితులమేనంటూ మొసలి కన్నీరు కార్చారు. పహల్గాం దాడిపై తటస్థ, పారదర్శక, స్వతంత్ర దర్యాప్తునకు సహకరిస్తామని తాము ఇప్పటికే ప్రకటించామన్నారు. అయినా సరే.. భారత్ తమపై సైనిక చర్యకు సిద్ధమవుతోందని ఆరోపించారు. దీనికి తమ నుంచి ప్రతిచర్య తీవ్రంగా ఉంటుందని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని నరేంద్రమోదీ నివాసంలో మంగళవారం జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం' అని మోదీ స్పష్టంచేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో పాక్ నుంచి స్పందన వచ్చింది. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనికి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో గుబులుగా ఉన్న ఆ దేశం.. పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులను ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.




సింహాచలం: విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

**మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు :** మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్‌వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధరించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందినవారు.

**మృతుల వివరాలు..**పత్తి దుర్గాస్వామి నాయుడు (32), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా, ఎడ్ల వెంకటరావు (48) అడవివరం, విశాఖపట్నం, కుమ్మపట్ల మణికంఠ (28), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా, గుజ్జరి మహాలక్ష్మి (65), హెచ్‌బీ కాలనీ, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పైలా వెంకటరత్నం (45), ఉమానగర్, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పిళ్లా ఉమామహేశ్ (30), చంద్రపాలెం, మధురవాడ, విశాఖపట్నం, పిళ్లా శైలజ (26) చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం.

**భారీగా తరలివచ్చిన భక్తులు :** వరాహ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రొటోకాల్, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేశారు.

## సింహాచలం ఘటన.. రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

దిల్లీ: సింహాచలం ఆలయం వద్ద జరిగిన ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి జాతీయ సహాయనిధి నుంచి పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.



**ప్రమాద ఘటన తీవ్ర ఆవేదన కలిగించింది: సీఎం రేవంత్‌రెడ్డి...** సింహాచలంలో ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోడ కూలి భక్తులు మృతి చెందిన ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ...** సింహాచలం ఘటనపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోడ కూలి ప్రాణ నష్టం జరగడం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి: కేటీఆర్...** సింహాచలం ప్రమాద ఘటనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## సింహాచలంలో జరిగిన దుర్ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసింది: మంత్రి నారా లోకేశ్

అమరావతి: సింహాచలం ఆలయం వద్ద జరిగిన దుర్ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి నారా లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు.



**క్యూలైన్‌లో ఉన్న ఏడుగురి మృతి బాధాకరం: పురందేశ్వరి...** సింహాచలం దుర్ఘటనపై భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

క్యూలైన్‌లో ఉన్న ఏడుగురు మృతిచెందడం బాధాకరమన్నారు. చందనోత్సవ సమయాన ఘటన జరగడం దురదృష్టకరమంటూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**మంత్రుల సంతాపం...** సింహాచలం ప్రమాదంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కొల్లు రవీంద్ర, సంధ్యారాణి, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## చందనోత్సవ సమయాన ఈ ఘటన దురదృష్టకరం: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



అమరావతి: సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మృతిచెందినట్లు తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చందనోత్సవ సమయాన ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో జనసేన పార్టీ పోస్ట్ చేసింది. "మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. విశాఖపట్నం జిల్లా అధికారుల నుంచి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నాను. భారీ వర్షాల మూలంగా గోడ కూలిందని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించాను" అని పవన్ పేర్కొన్నారు.

## 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వండి.. సింహాచలం ఘటనపై సీఎం చంద్రబాబు

అమరావతి: సింహాచలం ఘటనపై ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి డీజీపీ, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఘటన జరిగిన తీరు, బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై విచారణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ వెంకటేశ్వరరావును సభ్యులుగా చేర్చారు. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక అందజేయాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.





కోవూరు: నెల్లూరు జిల్లా కోవూరు మండలంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఆరుగురు మృతిచెందారు. పోతిరెడ్డిపాలెం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది.

ముంబయి జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్‌బంకు వద్దకు రాగానే అదుపుతప్పిన కారు ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆ ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బుచ్చిరెడ్డి పాలెంలో స్నేహితుడి అక్క నిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. దీంతో స్థానికులు పోలీసులు, 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతూ ఐదుగురు వైద్య విద్యార్థులు సైతం ప్రాణాలు కోల్పోయారు. మృతులను జీవన్, విఘ్నేష్, నరేశ్, అభిసాయి, అభిషేక్‌గా గుర్తించారు.

మరో విద్యార్థి మౌనిత్ రెడ్డి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు సమాచారం.

## జనసేన పార్టీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 30: తనతో ఉన్న కొంత మంది నాయకులు తాను చనిపోవాలని కోరుకుంటున్నారంటూ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాను ఎన్డీఏ ఎమ్మెల్యేని.. తాను చనిపోతే ఉప ఎన్నిక వస్తే.. కొంత మంది ఎమ్మెల్యే అయిపోవాలని చూస్తున్నారంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు త్యాగాల వల్ల తనకు ఎమ్మెల్యే సీటు రాలేదన్నారు. మూడు పార్టీలు కలిసి తనకు మ్యాండేట్ ఇచ్చాయని ఆయన గుర్తు చేశారు. తాను గెలిచిన తర్వాత తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజల కోసం పని చేస్తున్నానన్నారు. అధికారులను ఇబ్బంది పెట్టి.. వారిని బెదిరిస్తే సహించేది లేదని.. వారిని కాపాడుకుంటానని ఆయన స్పష్టం చేశారు. తాను చనిపోయిన తర్వాత మీరు ఎమ్మెల్యే అవ్వాలని కోరుకుంటున్నానన్నారు. తనకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మండేట్ ఇస్తే.. తాడేపల్లిగూడెం ప్రజల వల్ల ఎమ్మెల్యేగా గెలుపొందానని చెప్పారు. ఎవరి దయ దక్షిణ్యాల వలన తాను గెలవలేదని తెలిపారు. మరో పిఠాపురం చేసేస్తానంటున్నారని.. తానేమీ




చేతికి గాజులు తొడుక్కోలేదన్నారు. తాను స్థలాలు, పొలాలు పూడ్చలేదని.. కానీ తనకు ఓట్లు వేసి గెలిచిపించిన ప్రజల కోసం తాను పని చేస్తున్నానంటూ ఆయన కుండ బద్దలు కొట్టారు. తెలుగుదేశం పార్టీలో ఏ కార్యకర్తను తాను ఇబ్బంది పెట్టలేదన్నారు. కానీ శాసన సభ్యుడిగా మాత్రం గౌరవం ఇవ్వండంటూ కూటమిలోని మిత్ర పక్ష పార్టీ నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు..

## నెవ్వర్ బిఫోర్ అనేలా స్పై పాప గ్లామర్ ఎటాక్..

తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఐశ్వర్య మెనన్ సోషల్ మీడియాలో మళ్లీ హాట్ టాపిక్ అవుతోంది. తెల్లటి టాప్, షార్ట్ ప్యాంట్‌లో స్టన్నింగ్ లుక్‌తో పోజులిచ్చిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. 'గ్రేస్ ఇన్ ఎవరీ గ్లాన్స్, పీస్ ఇన్ ఎవరీ బ్రీత్' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ స్టిల్స్‌కి అభిమానుల నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది. ఐశ్వర్య మెనన్ కెరీర్ విషయానికి వస్తే.. 2012లో తమిళ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె తరువాత కేవలం గ్లామర్‌కు పరిమితం కాకుండా, ప్రామాణికమైన పాత్రలతోనూ మెప్పిస్తోంది. కన్నడ తెలుగులో నటించి ఆకట్టుకుంది. తెలుగులో ఆమధ్య స్పై, భజే వాయు వేగం వంటి సినిమాలలో మంచి పాత్రలు చేసింది. అయితే ఆమెకు భారీ మార్కెట్ ఉండకపోయినా, తన సొగసుతో, హావభావాలతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోల్లో ఆమె చూపించిన స్టైలింగ్, హేర్‌స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా ఉండటమే కాకుండా, యూత్‌ను



విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తెల్లటి కాస్ట్యూమ్‌లో ఆమె చూపించిన క్యాషువల్ యెట్ గ్లామరస్ లుక్‌కి వావ్ అంటున్నారు నెటిజన్లు. నేచురల్ లైటింగ్‌లో తీసిన ఈ ఫోటోలు ఐశ్వర్య మెనన్ అందాన్ని మరో లెవెల్‌లో చూపిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఆమె తమిళ, తెలుగు చిత్రాలతో పాటు ఓ వెబ్ సిరీస్ ప్రాజెక్ట్‌లోనూ బిజీగా ఉంది. కొంతకాలంగా సరైన హిట్ లేక పోయినా.. సోషల్ మీడియా పాపులారిటీతో మళ్లీ అవకాశాలు అందుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్ట్ చేసిన ప్రతి ఫోటోకి వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు రావడం గమనించదగ్గ విషయం. ఐశ్వర్య మెనన్ కెరీర్ పుంజుకోవడం కోసం మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తోంది. ఇక ఫ్యాషన్, ఫొటోషూట్‌లతో యూత్‌ను కట్టిపడేస్తోంది.

## అనుపమ బౌన్స్ బ్యాక్ ఛాన్సులు..!

మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ తెలుగులో స్టార్ హీరోయిన్ గా అయ్యే ఛాన్స్ లు కనిపించినా అమ్మడు చేసిన కొన్ని సినిమాల వల్ల గ్రాఫ్ పడిపోయింది. మొదట్లో అనుపమని చూసి టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందన్న టాక్ వినబడింది. కానీ అమ్మడు మాత్రం ఎందుకో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తెలుగులో రెండేళ్ల క్రితం ఈగల్ సినిమాలో నటించిన అనుపమ ఆ తర్వాత పెద్దగా ఛాన్స్ లు అందుకోలేదు. లాస్ట్ ఇయర్ వచ్చిన టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ అయినా కూడా అనుపమకి ఏమాత్రం లాభం చేకూరలేదు. ఆ తర్వాత అసలు అవకాశాలన్న మాటే రాలేదు. ఐతే తెలుగులో కాస్త గ్యాప్ రాగా.. ఈ గ్యాప్ లో తమిళ్ లో సినిమాలు చేస్తూ వచ్చింది అనుపమ. రీసెంట్ గా అమ్మడు డ్రాగన్ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. కానీ ఆ సినిమాలో అనుపమ కన్నా మరో హీరోయిన్ గా నటించిన కయదు



లోహార్ కి ఎక్కువ క్రేజ్ వచ్చింది. ఐతే తెలుగులో అనుపమ కెరీర్ ఇక దాదాపు ముగిసింది అనుకునేలోగా మళ్లీ వరుస ఛాన్స్ లు అమ్మడి తలుపు తడుతున్నాయి. అనుపమ ఇప్పటికే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా చేస్తున్న కిష్కింధపురి సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. కొన్నాళ్లుగా సెట్స్ మీద ఉన్న ఈ సినిమాకు టైటిల్ లాక్ చేసి ఒక పోస్టర్ కూడా వదిలారు. ఆల్రెడీ అనుపమ సాయి శ్రీనివాస్ తో రాక్షసుడు సినిమా చేసింది. ఆ సినిమా సక్సెస్ అందుకుందని తెలిసిందే. మరోపక్క యువ హీరో ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ తో కూడా లక్కీ ఛాన్స్ పట్టేసింది అనుపమ. శర్వానంద్ సంపత్ నంది కాంబినేషన్ లో వస్తున్న పీరియాడికల్ సినిమాలో అనుపమ హీరోయిన్ గా ఓకే అయ్యింది. ఈమధ్యనే ఓదెల 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంపత్ నంది. ఈసారి తన డైరెక్షన్ లో సినిమాతో ఆడియన్స్ ని అలరించడానికి రెడీ అయ్యాడు. సంపత్ నంది శర్వానంద్ కాంబో సినిమా 1965 కాలం నాటి కథతో వస్తుందని తెలుస్తుంది. సో పీరియాడికల్ కథ, క్రేజీ కాంబినేషన్ కాబట్టి ఇది అనుపమకి కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. అనుపమ మాత్రం తిరిగి మళ్లీ తన ఫాం కొనసాగించాలని చూస్తుంది. ఈ ప్రయత్నంలో అమ్మడికి ఎలాంటి ఫలితాలు అందుతాయన్నది చూడాలి.






## ప్రభాస్, అనుష్క, చిరంజీవి, రిషబ్ షెట్టీ.. బిగ్ బాక్సాఫీస్ క్లాష్?



తెలుగు సినిమా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న గ్రాండ్ ఫెస్టివల్ సీజన్ మళ్ళీ దసరా కానుంది. వేసవిలో పెద్ద సినిమాలు రాకపోవడంతో, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ఇప్పుడు దసరా సీజన్‌పై పూర్తి దృష్టి పెట్టారు. షూటింగ్‌లు పూర్తి అయినా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల వల్ల వాయిదా పడిన భారీ సినిమాలు ఇప్పుడు ఒకేసారి దసరాకు రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. దీంతో అక్టోబర్ నెల బాక్సాఫీస్ దగ్గర పెద్ద పోటీ మొదలయ్యేలా కనిపిస్తోంది. ఈ పోటీలో నెంబర్ వన్ అట్రాక్షన్ ప్రభాస్ నటించిన రాజా సాబ్. ఏప్రిల్ రిలీజ్ కోసం ప్లాన్ చేసినప్పటికీ, సాంకేతిక పనుల్లో జాప్యం కారణంగా రిలీజ్‌ను దసరాకు మళ్లించారు. అయితే రాజా సాబ్ విషయంలో ఎప్పుడూ ఒక కన్ఫ్యూజన్ ఉంటుందన్నది అందరికీ తెలిసిందే. తుది నిర్ణయం ఇంకా అధికారికంగా రాలేదు. అయినా ఇప్పటివరకు లెక్కలు చూస్తే, దసరా రిలీజ్ టార్గెట్ అన్న మాట వినిపిస్తోంది. ఇక మరోవైపు అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన ఘాటి సినిమా కూడా దసరా రిలీజ్‌నే లక్ష్యంగా పెట్టుకుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, విజువల్ వర్క్ కారణంగా లేట్ అవుతోంది. మొదట ఏప్రిల్ 18న థియేటర్స్ లోకి రావాల్సిన ఈ మూవీ ఇప్పుడు ప్రభాస్ రాజా సాబ్ తోనే డైరెక్ట్ క్లాష్ చేసే పరిస్థితిలో ఉంది. ఇది నిజమైతే, ఈ 'బాహుబలి' జోడి బాక్సాఫీస్ వద్ద తలపడడం ఇంట్రెస్టింగ్ గా మారే అవకాశం ఉంటుంది. దీనికితోడు చిరంజీవి నటిస్తున్న భారీ విజువల్ ఫాంటసీ డ్రామా విశ్వంభర కూడా పోస్ట్ ప్రొడక్షన్ కారణంగా వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. మొదట ఆగస్టు/సెప్టెంబర్ రిలీజ్ అనుకున్నారు. కానీ ప్రస్తుత వేగం చూస్తే, దీని రిలీజ్ కూడా దసరాకే వస్తుందని ఊహిస్తున్నారు. ఒకవేళ ఇది జరిగితే, మరో స్టార్ హీరో కూడ పోటీకి వచ్చేస్తాడు. టాలీవుడ్ కాకుండా, కన్నడ ఇండస్ట్రీ నుంచి రిషబ్ షెట్టి కాంతార: చాప్టర్ 1 కూడా అధికారికంగా దసరా రిలీజ్ లాక్ చేసేసింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, పోస్టర్స్ బట్టి ఆడియన్స్ లో మంచి హైప్ క్రియేట్ అయింది. ఇదే సమయంలో బాలయ్య అఖండ 2 కూడా సెప్టెంబర్ చివర షెడ్యూల్ చేసుకున్నారు. కానీ చిన్నపాటి ఆలస్యం జరిగితే, అది కూడా దసరా బరిలో దిగే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే, దసరా 2025 బాక్సాఫీస్ దగ్గర మామూలు పండగ కాదు. అన్ని అనుకున్నట్లే జరిగితే పెద్దగా గ్యాప్ లేకుండా ప్రభాస్, అనుష్క, చిరంజీవి, రిషబ్ షెట్టి, బాలకృష్ణ వంటి స్టార్ హీరోల సినిమాలు ఒకేసారి పోటీకి రావడం ఇప్పుడు ఖాయంగా కనిపిస్తోంది. ఇది ఏ సినిమాకు ప్లస్ అవుతుందో, ఏ సినిమాకు మైనస్ అవుతుందో వేచి చూడాల్సిందే. మరికొద్ది వారాల్లో అధికారిక తేదీలు వెల్లడవుతాయని సమాచారం.

## ఈ మే మామూలుది కాదు.. మెగా మే



మెగా ఫ్యాన్స్ కు ఈ సంవత్సరం మే చాలా ఎగ్జయింట్ నెలగా మారబోతుంది. దానికి కారణం ఒకటి కాదు, చాలానే ఉన్నాయి. అందులో మొదటిది చిరంజీవి నటించిన బ్లాక్ బస్టర్ ఐకానిక్ మూవీ జగదేక వీరుడు అతిలోక సుందరి మే 9న రీరిలీజ్ కానుండటం. ఎంతోకాలంగా ఈ సినిమా రీరిలీజ్ కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తుండగా, మే 9న ఈ సినిమా 35 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మేకర్స్ రీరిలీజ్ ప్లాన్ చేశారు. మే 9వ తేదీన ఈ సినిమా టూడీ, త్రీడీ ఫార్మాట్ వెర్షన్లలో రిలీజ్ కానుంది. ఈ విషయం చిరూ ఫ్యాన్స్ తో పాటూ 90స్ కాలం నాటి వారందరికీ ఎంతో స్పెషల్. కాకపోతే మెగాఫ్యాన్స్ కు ఆ సంతోషం ఇంకొంచెం ఎక్కువ ఉంటుంది. దీంతో పాటూ అదే రోజు లండన్ లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో రామ్ చరణ్ మైనపు విగ్రహం కూడా ఓపెన్ కానుంది.


ఈ కార్యక్రమానికి చరణ్ తన ఫ్యామిలీతో కలిసి హాజరు కానున్నాడు. మెగా ఫ్యాన్స్ కు ఇది చాలా మెమరబుల్ మూమెంట్ అని చెప్పొచ్చు. తమ అభిమాన హీరో విగ్రహం మేడమ్ టుస్సాడ్స్ లో పెట్టడమనేది చిన్న విషయం కాదు కాబట్టి చరణ్ ఫ్యాన్స్ ఈ విషయాన్ని చాలా గ్రాండ్ గా సెలబ్రేట్ చేయనున్నారు. అంతేకాదు మరో అంశం కూడా ఉంది. రాయల్ ఆల్బర్ట్ హాల్ లో జరిగే ఆర్ఆర్ఆర్ లైవ్ ఆర్కెస్ట్రా పెర్ఫార్మెన్స్ కు కూడా చరణ్ హాజరు కాబోతున్నాడు. ఇదిలా ఉంటే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు షూటింగ్ ను మే లోనే పూర్తి చేసి డబ్బింగ్ ను కూడా చెప్పడానికి ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

దాంతో పాటూ మే నెలలోనే ఓజి సినిమా షూటింగ్ ను కూడా మొదలుపెట్టాలని చూస్తున్నాడట పవన్. పవన్ ఫ్యాన్స్ ఎప్పట్నుంచో వెయిట్ చేస్తున్న ఓజి సినిమా కోసం వెయిట్ చేస్తున్న సంగతి తెలిసిందే. అందుకే ఓజి సినిమాకు సంబంధించిన వాళ్ళు ఎవరు బయట కనిపించినా సినిమా గురించి అప్డేట్ అడుగుతూ హంగామా చేస్తున్నారు.

మొత్తానికి ఈ 2025 మే చిరంజీవి సినిమా రీరిలీజ్, రామ్ చరణ్ మైనపు విగ్రహ ఆవిష్కరణ, పవన్ కళ్యాణ్ షూటింగులతో మెగా ఫ్యాన్స్ కు స్పెషల్ గా మారనుంది.

## 'సింగిల్' ట్రైలర్.. అబ్బాయిల కోసం శ్రీ విష్ణు లవ్ టిప్స్

తెలుగు సినిమా ప్రేక్షకుల ముందుకు మరో రొమాంటిక్ కామెడీ సినిమా రాబోతోంది. ఎంటర్టైన్‌మెంట్ కింగ్ శ్రీ విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'సింగిల్' సినిమా ట్రైలర్ లేటెస్ట్ గా విడుదలైంది. గీతా ఆర్ట్స్ సమర్పణలో, కాల్య ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. కేతికా శర్మ, ఇవానా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఎంటర్టైన్మెంట్ కు న్యూ డోస్ ఇవ్వబోతున్నట్లు ట్రైలర్ స్పష్టంగా చెబుతోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే నవ్వులు పూయించేలా ఉంటుంది. శ్రీ విష్ణు ప్రేమలో విజయవంతం కావాలంటే మూడు టిప్స్ అంటూ చెప్పడం ఫన్‌గా కనిపించింది. ముద్దుగా మంచి అబ్బాయిగా కనిపించడం, తరువాత బ్యాడ్ బాయ్ యాటిట్యూడ్ చూపించడం, చివరగా మాస్ వాయిస్‌లో రౌడీగా మారడం వంటి మూడు దశలను ఫన్నీగా చూపించారు. ఈ క్రమంలో పూర్వ అనే అమ్మాయిని ప్రేమించగా, మరో అమ్మాయి హరిణి గుండె లోతుల్లో ప్రేమను పంచుకుంటోంది. ఇలా ట్రయాంగిల్ లవ్ లో కథ నడుస్తుందని అర్థమవుతోంది. ఈ కథనానికి సరదా గమ్మత్తైన ట్రీట్‌మెంట్‌తో కాంబినేషన్ ఇచ్చారు. శ్రీ విష్ణు టైమింగ్, డైలాగ్ డెలివరీ




ట్రైలర్‌లోనే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలకృష్ణ స్టైల్‌ను అనుకరిస్తూ ఇచ్చిన మిమిక్రీ సీన్ నవ్వులు తెప్పించనుంది. కేతికా శర్మ, ఇవానాలు కూడా తమ క్యారెక్టర్‌లకు పర్ఫెక్ట్ గా సరిపోయారు. వెన్నెల కిషోర్ కామెడీ సీన్స్ ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టెక్నికల్‌గా చూస్తే, సినిమాకు బలమైన సపోర్ట్ కనిపిస్తోంది. ఆర్. వెల్‌రాజ్ సినిమాటోగ్రఫీ విజువల్స్‌కు స్పెషల్ లుక్ ఇచ్చింది. విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ సినిమాకి ఎనర్జీని పెంచింది. ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ స్పీడ్‌తో సినిమా రీతిని క్లీన్‌గా తీసుకెళ్లేలా ఉంది. గీతా ఆర్ట్స్, కాల్య ఫిలిమ్స్ నిర్మాణ విలువలు సినిమా ప్రమోషన్స్‌లోనే హై స్టాండర్డ్‌గా కనిపిస్తున్నాయి. ఈ వేసవిలో మజా కోరుకునే ప్రేక్షకులకు 'సింగిల్' సినిమా మంచి ట్రీట్ అవుతుందనడంలో సందేహం లేదు. మే 9న థియేటర్లలో విడుదలకానున్న ఈ సినిమా యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ రెండింటినీ ఆకట్టుకునేలా టచ్ చేస్తుందని ట్రైలర్ చూపిస్తోంది. మరి శ్రీ విష్ణు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడో చూడాలి.

## చీర కట్టులో కేతిక రొమాంటిక్..!

నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్' సినిమాలో అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటెం సాంగ్ చేసి అందరినీ నిజంగానే సర్‌ప్రైజ్ చేసిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. ఆమె కాస్ట్యూమ్స్, మేకోవర్, డాన్స్ స్టెప్పులు ఇలా ప్రతి ఒక్కటీ మాస్ ఆడియన్స్‌కి నచ్చాయి. కేతిక శర్మ హీరోయిన్‌గా కెరీర్ ఆరంభంలో మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకున్నప్పటికీ లక్ కలిసి రాకపోవడంతో తక్కువ సమయంకే హీరోయిన్‌గా ఆఫర్లు లేకుండా పోయాయి. హీరోయిన్‌గా ప్రస్తుతం ఈమె చేస్తున్న సినిమాలు పెద్దగా ఏమీ లేదు. అయినా కూడా ఈమెకు సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపు దక్కింది. ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 3.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే. సినిమాల్లో అందంగా కనిపించడంతో పాటు, నటనతో మెప్పించే కేతిక శర్మ సోషల్ మీడియాలో పూర్తి స్థాయిలో అందాల ఆరబోతతో ఆకట్టుకుంటూ ఉంది. అందంగా ఉండే కేతిక శర్మ సింపుల్ ఔట్ ఫిట్ నుంచి స్కిన్ షో చేసే ఔట్ ఫిట్ వరకు ఏ డ్రెస్‌లో కనిపించినా కూడా చూపు తిప్పుకోనివ్వని అందం ఈమెది అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా ఈమెకు మంచి ఎంట్రీ దక్కడానికి కారణం ఈమె అందం అనడంలో సందేహం లేదు. ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు. తాజాగా ఈమె ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



సాధారణంగానే హీరోయిన్స్ చీర కట్టు ఫోటోలను షేర్ చేస్తూ చూపు తిప్పుకోలేము. అలాంటిది కేతిక శర్మ వంటి అందగత్తె చీర కట్టుకుని, అందంగా కెమెరాకు ఫోజ్ ఇస్తున్న వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సాధారణంగా ఫోటో స్టిల్స్ ను షేర్ చేస్తారు. కానీ ఈ అమ్మడు ఫోటో షూట్‌కి సంబంధించిన వీడియోను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. కేతిక శర్మ అందం గురించి గతంలో ఎన్నో సార్లు మాట్లాడుకునే ఉంటాం. అయినా కూడా ఈమె ఇలాంటి వీడియోలను, ఫోటోలను షేర్ చేసిన సమయంలో మరోసారి ఈమె అందం గురించి మాట్లాడుకోవాల్సిందే అనిపిస్తూ ఉంటుంది. నడుము అందం చూపిస్తూ కేతిక హొయలు పోతూ షేర్ చేసిన వీడియో ఆకట్టుకుంటూ ఉంది. చీర కట్టులో కేతిక శర్మ ఫోటోలు చాలా సార్లు షేర్ చేసింది. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా ఆకట్టుకుంటుంది. అందమైన ఫోటోలు, వీడియోలతో ఎప్పుడూ కేతిక శర్మ వార్తల్లో నిలుస్తున్న కారణంగా కచ్చితంగా ఈమెకు మరిన్ని ఆఫర్లు దక్కవచ్చు. ప్రస్తుతం రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. త్వరలోనే ఆ సినిమాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. హీరోయిన్‌గా ఈమె చివరిగా రంగ రంగ వైభవంగా సినిమాలో వైష్ణవ్ తేజ్‌కు జోడీగా నటించింది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ బ్రో సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. ఆ సినిమా తర్వాత ఒక హిందీ సినిమాను కూడా ఈమె చేసింది.




కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేసే జనాభా లెక్కల్లో కులగణన చేస్తామనడం తెలంగాణ ప్రభుత్వ విజయం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు తొలగించడానికి దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేశారని చెప్పారు. ఇందుకోసం ముందుగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేసి దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. కులగణన ఆధారంగా బీసీ లకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని తెలిపారు. ఇది ఒక్క గొప్ప మార్పుగా భావిస్తున్నాం. దీని ద్వారా సామాజిక రుగ్మతలు తొలగి అందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని ఆకాంక్షిస్తున్నట్లు పొన్నం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ . కులగణనతో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం నిర్ణయం తీసుకొని పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించడం జరిగింది. దేశ చరిత్రలో మొదటిసారిగా కుల గణన నిర్వహించాం. కులగణన చేపట్టాలనే రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ప్రజల ఒత్తిడి మేరకు కులగణనకు ఒప్పుకుంది. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే శాస్త్రీయంగా కులగణనను విజయవంతంగా పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలిచింది. కులగణన లెక్కల ఆధారంగా తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. తెలంగాణలో కాంగ్రెస్ నిర్వహించిన కులగణనను ఇంతకాలం అపహాస్యం చేసిన బీజేపీ ఇప్పుడు మా దారిలోకి రావడం సంతోషకరం. కేంద్ర ప్రభుత్వం అదే బాటలో తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు మహేశ్ కుమార్ గౌడ్. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం శుభ పరిణామం అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు.జనగణనలో కులగణన అన్ని వర్గాలకు మేలు చేస్తుందనేది రాహుల్ గాంధీ డిమాండ్ అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి %దీజ% బిల్లుపై ఒత్తిడే కేంద్ర నిర్ణయానికి కారణం అని అన్నారు. రాజకీయాల కోసం, ఎన్నికల కోసం కాకుండా చిత్తశుద్ధిగా అమలు చెయ్యాలని చెప్పారు.




## ఆ నీళ్లు పాక్‌కు వెళ్తాయి.. మాకివ్వండి: పంజాబ్‌ను అభ్యర్థించిన హరియాణా

పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా అభ్యర్థించింది. లేకపోతే.. ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది కూడా ఒకటి కావడం విశేషం. "జూన్ నాటికి భాక్రా నంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలను నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్‌లో అప్పుడు నీరు లేకపోతే.. అదనపు జలాలు హరి–కె–పట్టాన్ నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్.. ఇటు హరియాణాకు ఉపయోగపడదు. దిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గత నెల భాక్రా బేస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, దిల్లీకి పోగా హరియాణాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హరియాణాకు రావాల్సిన వాటా ఇచ్చినా.. అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం" అని నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలమ్ సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్ నీటి అవసరాలను తీరుస్తోంది.

# కులగణనపై కేంద్రం కీలక నిర్ణయం

దేశంలో కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జనాభా లెక్కల్లోనే దీనిని చేర్చుతామని కేంద్రం ప్రకటించింది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని, ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నేడు కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ)ను సూపర్ కేబినెట్‌గా వ్యవహరిస్తారు.

నేడు జరిగిన భేటీలో కులగణనకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయన్నారు.

ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్





కారణంగా వాయిదా పడిన విషయం తెలిసింది. భారత్–పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. గత రెండు రోజులుగా దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో రక్షణమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో సమావేశం జరిగింది. నేడు భద్రతపై కేబినెట్ కమిటీ , అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది.





హైదరాబాద్: తెలంగాణలో 10వ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం మధ్యాహ్నం 2.15 గంటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. రవీంద్రభారతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫలితాలను ఆయన రిలీజ్ చేశారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 92.78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గురుకులాల్లో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. గత ఏడాదితో పోలిస్తే 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు అయ్యింది. బాలురు 91.32 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ సారి కూడా బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికల కంటే బాలురు 2.94 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే రెండు పాఠశాలలు మాత్రం సున్నా శాతం ఫలితాలు పొందాయి. టెన్త్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా 99.29 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా.. వికారాబాద్ జిల్లా 73.97 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు తెలంగాణలో పదో తరగతి పరీక్షలు జరిగాయి. దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడం.. మార్కుల మెమోలను ఎలా ఇవ్వాలన్న అంశంపై ఇప్పటికే అధికారులకు పూర్తిస్థాయి స్పష్టత వచ్చింది. దీంతో ఈ పరీక్ష ఫలితాలు ఈరోజు విడుదల చేశారు.

## కర్రెగుట్టల్లో ఆపరేషన్.. ఉపగ్రహ ఛాయాచిత్రాలు, డ్రోన్ల సాయంతో గాలింపు



చర్ల: ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో తొమ్మిదో రోజు భద్రతా బలగాల ఆపరేషన్ కొనసాగుతోంది. బ్లాక్‌హిల్స్‌గా పేరుగాంచిన కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం వేట సాగిస్తున్నారు. ఇప్పటికే అన్ని సరిహద్దు ప్రాంతాలను భద్రతా బలగాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ క్రమంలోనే 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఆపరేషన్‌లో పాల్గొని అలసిన బలగాలు వెనక్కి వస్తున్నాయి. దీంతో వారి స్థానంలో బ్యాకప్ పార్టీలను తరలించారు. మావోయిస్టుల ఆచూకీ కోసం ఉపగ్రహ ఛాయాచిత్రాలు వినియోగిస్తున్నారు. డ్రోన్ల సాయంతో గాలింపు చేపట్టారు. పూజారీ కాంకేర్, నడిపల్లి ప్రాంతాలు మంగళవారం బాంబుల శబ్దాలతో హోరెత్తాయి. ఈ ఆపరేషన్ పర్యవేక్షణ కోసం ఐబీ చీఫ్ తపన్ దేకా రంగంలోకి దిగారు. రాయ్‌పుర్‌లో ఆపరేషన్‌పై ఆయన కీలక సమావేశం నిర్వహించారు.

## యాదాద్రి జిల్లాలో పేలుడు ఘటన.. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం



హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లాలో నిన్న జరిగిన భారీ పేలుడు ఘటనలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం విషాదం రేపింది. దీంతో మృతుల కుటుంబాలకు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అలాగే, బాధిత కుటుంబంలో ఒకరికి కంపెనీలో శాశ్వత ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేలా కంపెనీ అంగీకరించింది. యాదాద్రి జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లోని 18ఏ బ్లాక్ భవనంలో మంగళవారం భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. క్వారీల్లో వినియోగించే బాంబుల ముడిసరకును ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ఘటన సమయంలో భవనంలో మొత్తం తొమ్మిది మంది కార్మికులు ఉండగా.. ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## ఆ ఉత్తర్వులను నిలుపుదల చేయలేం.. ఐపీఎస్‌ల పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: ఐపీఎస్‌ల పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు ముగించింది. భూదాన్ భూములను నిషేధిత జాబితాలో ఉంచాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేయడానికి నిరాకరించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై అదే బెంచ్‌లో వెకేట్ పిటిషన్ వేసుకోవచ్చని పేర్కొంది.

**అసలేం జరిగిందంటే..** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 194లో పలువురు ఐపీఎస్ అధికారులు భూములు కొనుగోలు చేశారు. ఇవి భూదాన్ భూముని.. కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై ఈ నెల 24న విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 27 మంది అధికారులకు చెందిన భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని ఆదేశించింది. అవి భూదాన్ భూములే అని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ భాస్కర్‌రెడ్డి సింగిల్ బెంచ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తాజాగా కొందరు ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. వీరిలో రవిగుప్తా, మహేశ్ భగవత్, శిఖా గోయల్, తరుణ్ జోషి, రాహుల్ హెగ్డే, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా ఉన్నారు. ఆ భూములు భూదాన్‌వి కాదని,



పట్టా భూములేనంటూ ఆ ఐపీఎస్ అధికారులు హైకోర్టుకు నివేదించారు. సర్వే నంబరు 194లో 16, 20, 18 గుంటల విస్తీర్ణాలతో కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించిన విక్రయ ఒప్పందపత్రాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈక్రమంలో బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేయడానికి నిరాకరించింది.

## వారంలోగా సమాచారం ఇవ్వండి.. గ్రూప్-1 అంశంపై టీజీపీఎస్సీ ఛైర్మన్‌కు కేంద్రమంత్రి లేఖ

హైదరాబాద్: గ్రూప్–1 వ్యవహారంపై వారం రోజుల్లో సమగ్ర సమాచారం అందించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ టీజీపీఎస్సీని కోరారు. ఈ మేరకు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు లేఖ రాశారు. గ్రూప్–1 అభ్యర్థుల సందేహాలను లేఖలో ప్రస్తావించారు. గ్రూప్–1లో అవినీతి, అక్రమాలు, తప్పిదాలు జరిగాయని అభ్యర్థులు ఆందోళన చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని పలువురు అభ్యర్థులు బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేశారు. వారి ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న కేంద్రమంత్రి.. టీజీపీఎస్సీకి లేఖ రాశారు.



## గ్రూప్-1 నియామకాలు.. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోలేం: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్–1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీలు దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీజే ధర్మాసనంలో టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో బుధవారం వాదనల సందర్భంగా సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది కోరారు. దీనికి సీజే ధర్మానసం నిరాకరించింది. ఈరోజు మధ్యాహ్నం సింగిల్ బెంచ్‌లో విచారణ ఉన్నందున జోక్యం చేసుకోలేమంది. సింగిల్ బెంచ్‌లో ఈ పిటిషన్లపై తేల్చుకోవాలని స్పష్టం చేసింది.

రంగారెడ్డి జిల్లా: భూదాన్ భూముల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ కొనసాగుతోంది. ప్రముఖ వ్యాపారవేత్త, రియాల్టర్ నుంచి 40 వింటేజ్ కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వ్యాపారవేత్త తల్లి తన వారసత్వ ఆస్తిగా పేర్కొంటూ భూదాన్ ల్యాండ్ దందా చేశారు. మునవార్ తల్లి తన వారసత్వ ల్యాండ్‌గా భూదాన్ భూములను చూపెట్టి వ్యాపారం చేశారు. నాగారంలో మునవార్ వందల ఎకరాల భూములను కబ్జా చేశారు. మనోహర్‌తో పాటు ఈడీ అధికారులు ఆరు చోట్ల సోదాలు నిర్వహించారు. పెద్ద మొత్తంలో భూదాన్ భూముల పత్రాలతో పాటు కార్లు స్వాధీనం చేసుకున్నారు. మునవార్‌కు చెందిన ఫామ్ హౌస్‌లో 40కు పైగా వింటేజ్ కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ కార్ల విలువే కోట్ల రూపాయలలో ఉంటుందని ఈడీ అధికారులు తేల్చారు. మునవార్ నుంచి భూములు కొనుగోలు చేసిన వారికి ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. కాగా భూదాన్ ల్యాండ్ వ్యవహారంలో ఈడీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఇక మహేశ్వరం ల్యాండ్ విషయంలోనూ తనిఖీలు చేపట్టారు. పాతబస్తీలోని మునావర్ ఖాన్, ఖదీర్ ఉన్నిసా, అలాగే సర్ఫాన్, సుకుర్ ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. మునావర్ ఖాన్, ఖదీర్ ఉన్నిసాలు భూదాన్ ల్యాండ్‌ను అక్రమంగా లే అవుట్ చేసి అమ్మకం చేశారు. గతంలో ఇదే కేసులో ఐఏఎస్ అమయ్ కుమార్‌ను (%×ూూ రాటటఅవెతీ–ూముఎ ఖబమ్షితీ%) ఈడీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, నాగారంలోని 181, 182 సర్వే నెంబర్‌లో సుమారు 103 ఎకరాల భూదాన్ భూమి ఉంది. అయితే ఈ భూమిపై గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఇందులో సుమారు 50 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయినట్లు సమాచారం. ఈ 50 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో.. వారు ఇందులో ప్లాట్లుగా విభజించి.. ప్రస్తుతం అమ్మకాలు చేపట్టారు. అయితే ఈ అంశం ప్రస్తుతం కోర్టులో పరిధిలో ఉంది. దీంతో దర్మాసనం ఆ భూములకు సంబంధించి లావాదేవీలపై స్టే విధించింది. అయితే ఈ అంశంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిగిన తర్వాత ఆ రిపోర్టు ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. భూదాన్ ల్యాండ్ వ్యవహారంలోనే గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమయ్ కుమార్‌కు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చి పలుమార్లు విచారించారు. అంతే కాకుండా అప్పటి ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు ఇచ్చి విచారించారు. చాలా కాలం గ్యాప్ తర్వాత మళ్లీ భూదాన్ భూముల వ్యవహారంపై ఈడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. అయితే అందులో ఎవరెవరైతే ప్లాట్లు కొనుగోలు చేశారో వాటిని రియల్ ఎస్టేట్ కంపెనీలకు విక్రయించారో, భూదాన్ భూములను కొనుగోలు చేసి వేరేవారికి విక్రయించిన వారిపై కూడా ఈడీ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం పాతబస్తీలో సోదాలు జరుగుతున్నాయి. యాకత్‌పూర, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.




Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com